

2 నుంచి నృసింహ దీక్షలు

సింహాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే నృసింహ దీక్షలను డిసెంబరు రెండున ప్రారంభించనున్నట్టు ఈవో వేంద్ర త్రినాథరావు ప్రకటించారు. అదేవిధంగా డిసెంబరు 12 నుంచి ద్వాత్రింశతి (32 రోజుల) దీక్షలు ప్రారంభమవుతాయన్నారు. జనవరి 12న దీక్షల విరమణకు ఆలయ వైదిక కమిటీ ముహూర్తం నిర్ణయించిందని వివరించారు. దీక్షలు స్వీకరించే భక్తులకు మూలవిరాట్ వద్ద పూజలు చేసిన తులసీ మాలలు, స్వామివారి ప్రతిమలను ఉచితంగా ఇస్తామన్నారు.

తీర్థయాత్రల రైళ్లు ఫుల్

ఎర్నాకులం వైపు వెళ్లే రైళ్లలో జనవరి 19 వరకూ బెర్తులు లభించని పరిస్థితి

- ప్రత్యేక రైళ్లు నడపాలని అయ్యప్ప భక్తుల విజ్ఞప్తి
- షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 16 వరకు ఖాళీల్లేవ్
- తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 28 వరకు డిమాండ్



విశాఖపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):

శబరిమలై, తిరుమల, షిర్డీ రైళ్లకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది. మండల దర్శనాలు ప్రారంభం కావడంతో ఎర్నాకులం వరకూ వెళ్లే రైళ్లకు తాకిడి పెరిగింది. ఎర్నాకులం రైళ్లకు జనవరి 19 వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు. అలాగే షిర్డీ వెళ్లే సాయినగర్ ఎక్స్‌ప్రెస్‌కు (18503) జనవరి 16 వరకు, తిరుపతి వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు (17488) డిసెంబరు నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా కనిపిస్తోంది. ఆ మూడు ప్రాంతాలకు విశాఖ మీదుగా నడిచే వారాంతపు రైళ్లకు కూడా అదే పరిస్థితి ఏర్పడింది.

శబరిమలై రైళ్లకు జనవరి 19 వరకు ఫుల్

విశాఖ నుంచి కొల్లాం ఒకే స్థిరమైన రైలు (వారాంతపు) మాత్రమే అందుబాటులో ఉన్న నేపథ్యంలో అయ్యప్ప భక్తులు ఎర్నాకులం చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే రైళ్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. ప్రతి గురువారం విశాఖ నుంచి కొల్లాం వెళ్లే ఎక్స్‌ప్రెస్ (18567)కు జనవరి 16 వరకు బెర్తులు నిండిపోయాయి. విశాఖ మీదుగా రోజూ నడిచే ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351), టాటా-ఎర్నాకులం (18189), డిబ్రుగర్-కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504)లలో జనవరి 19 వరకు బెర్తులు ఖాళీల్లేవు. అలాగే వారాంతపు, వారానికి రెండుసార్లు నడిచే రైళ్లు షాలిమార్-త్రివేండ్రం (22642), పాట్నా-ఎర్నాకులం (22644), షాలిమార్-నాగర్‌కోయిల్ గురుదేవ్ (12660), సిలిచర్-త్రివేండ్రం (12508), హటియా-ఎర్నాకులం (22837) రైళ్లలో జనవరి 20 వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు.

ఈ ఏడాది గణనీయంగా పెరిగిన అయ్యప్ప మాలధారుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని శబరిమలైకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టడంలో తూర్పుకోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ అధికారులు అంతగా ఆసక్తి చూపకపోవడం విచారకరం. ఉత్తరాంధ్ర నుంచి వెళ్లే అయ్యప్ప భక్తుల అవసరాలపై దృష్టిసారించకుండా ఒకే ఒక ప్రత్యేక రైలును ప్రవేశపెట్టి చేతులు దులుపుకున్నారు. 08539 నంబరుతో ప్రతి బుధవారం అందుబాటులో ఉండే ఈ ప్రత్యేక రైలు కూడా నవంబరు 27 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. దక్షిణ మధ్య రైల్వే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం 18 ప్రత్యేక రైళ్ల సర్వీసులను ప్రవేశపెట్టారు. వాల్తేరు రైల్వే అధికారులు ఆ విషయం గమనించి అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం జనవరి వరకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

షిర్డీ రైలుకు డిసెంబరు వరకు బెర్తులు ఫుల్

ప్రతి గురువారం విశాఖలో బయలుదేరే సాయినగర్ షిర్డీ వారాంతపు ఎక్స్‌ప్రెస్ (18503)కు మరింత డిమాండ్ ఏర్పడింది. విశాఖ నుంచి నేరుగా షిర్డీ చేరేందుకు ఉన్న ఏకైక రైలు కావడంతో ఫిబ్రవరి 6 వరకు బెర్తులు నిండిపోయాయి. అయితే జనవరి 2, 9 తేదీల్లో ఆర్‌ఏసీలో సీట్లు అందుబాటులో ఉన్నాయి. షిర్డీ సాయి దర్శనానికి వెళ్లేవారికి షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కు ప్రత్యామ్నాయంగా చెప్పుకునే విశాఖ-ఎల్‌టీటీ వయా రాయగడ ఎక్స్‌ప్రెస్ (22847)కు ... మిగతా 6వ పేజీలో



బీచ్ రోడ్డుకు వచ్చిన హెలికాప్టర్ విడి భాగాలు

ఆర్కే బీచ్‌రోడ్డుకు అదనపు ఆకర్షణ

సంక్రాంతికి హెలికాప్టర్ మ్యూజియం

- మొదలైన పనులు...ఐఎన్ఎస్ డేగా నుంచి యుహెచ్-3హెచ్ విడి భాగాలు తరలింపు
- రూ.2.2 కోట్ల వ్యయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని ఆర్కే బీచ్ రోడ్డుకు మరో అదనపు ఆకర్షణ జత కాబోతోంది. నేవీ మ్యూజియం కాంప్లెక్స్‌లో యుహెచ్ 3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియం రానున్నది. తూర్పు నౌకాదళంతో కలిసి విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఆర్కే బీచ్‌రోడ్డులో పర్యాటకుల కోసం మ్యూజియాలు ఏర్పాటుచేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ మూడు మ్యూజియాలు (కురుసుర సబ్‌మెరైన్, టీయూ-142 యుద్ధ విమానం, సీ హ్యారియర్ ఫైటర్ మ్యూజియం) ఏర్పాటయ్యాయి. నీటిలో మాత్రమే ఉండే సబ్‌మెరైన్‌ను అతి కష్టమ్మీద తీరానికి తీసుకువచ్చి మ్యూజియంగా మార్చారు. అలాగే టీయూ-142 యుద్ధ విమానాన్ని ఒకచోట నిలిపి...కాక్‌పిట్, లోపలి భాగాలు చూడడానికి పైకి మెట్లు నిర్మించారు. సీ హ్యారియర్ ఫైటర్ విమానాన్ని వినూత్నంగా గాలిలో వేలాడదీశారు. వీటి నిర్మాణం, సేవలు కళ్లకు కట్టేలా చిత్ర ప్రదర్శనలు ఏర్పాటుచేశారు.

ఇక నేవీలో పదిహేడేళ్ల సేవలు అందించి ఈ ఏడాది జూన్ 28వ తేదీన ఐఎన్ఎస్ డేగాలో డీ కమిషనింగ్ జరిగిన 'యుహెచ్-3హెచ్' హెలికాప్టర్‌ను తాజాగా మ్యూజియంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇది సీ హ్యారియర్ మ్యూజియానికి, టీయూ 142 మ్యూజియానికి మధ్యన వస్తుంది. సుమారు 23 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. దీనికి తొలుత రూ.80 లక్షల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇప్పుడు అది రెండు రెట్లు పెరిగి రూ.2.2 కోట్లకు చేరింది. ఈ నెల మొదటి వారంలో ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ ప్రాజెక్టును నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని అధికారులు ప్రకటించారు. సంక్రాంతికి ... మిగతా 6వ పేజీలో

ఫార్మా పరిశ్రమలు మూత!

ఐదు రోజులుగా నిలిచిన నీటి సరఫరా

- అచ్యుతాపురం సెజ్‌కూ సమస్య
- పంప్‌హౌస్ వద్ద మోటార్ల మొరాయింపు
- నిర్వహణ గాలికి వదిలేయడంతోనే సమస్య
- మరమ్మతులు చేయించామన్న ఏపీఐఐసీ జోనల్ మేనేజర్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పరవాడ రాంకీ ఫార్మా సిటీకి నాలుగు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఫార్మాసిటీలో వందకు పైగా మందుల తయారీ కంపెనీలు ఉన్నాయి. వాటి రోజువారీ కార్యకలాపాలకు నీరు చాలా ముఖ్యం. ఫార్మాసిటీని రాంకీ యాజమాన్యం అభివృద్ధి (డెవలపర్) చేయగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏపీఐఐసీ మౌలిక వసతులు సమకూర్చింది. ఏలేరు కాలువ నుంచి నీటిని తీసుకొని తాడి వద్ద గల పంప్ హౌస్ ద్వారా ఫార్మా సిటీకి పంపిస్తారు. అక్కడ వారు వాటిని శుద్ధి చేసి కంపెనీలకు సరఫరా చేస్తారు. ఇదే పంప్‌హౌస్ నుంచి అచ్యుతాపురం ఆర్థిక మండలిలోని ఫార్మా కంపెనీలకు కూడా పంపుతున్నారు. ఫార్మాసిటీకి, అచ్యుతాపురం ఆర్థికమండలికి కలిపి రోజుకు 15 మిలియన్ లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఇందుకోసం అత్యధిక సామర్థ్యం కలిగిన 750 హార్స్‌పవర్ మోటార్లు నాలుగు ఉన్నాయి. అవి పాడైతే మరమ్మతులు చేయడానికి టెక్నీషియన్లు కూడా అందుబాటులో ఉండరు. అందుకని వాటిని జాగ్రత్తగా నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది జూన్‌లో ఒక మోటారు పాడైపోయింది. దానికి మరమ్మతులు చేయించడానికి ఎవరూ ముందుకురాలేదు. ఆ తరువాత ఒకదాని తరువాత మరొకటి అన్నీ మొరాయించాయి. దీంతో నెల 15వ తేదీ (శుక్రవారం) సాయంత్రానికి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. విచిత్రం ఏమిటంటే...ఇక్కడ నీటిని ఏ రోజుకు ఆ రోజే సరఫరా చేస్తారు. ముందుచూపుతో కొంత నీటిని రిజర్వ్ చేసే సదుపాయం కూడా లేదు. దాంతో ఫార్మా కంపెనీలకు ఇబ్బందులు మొదలయ్యాయి. కొందరు అరకొరగా ఉన్న నీటితో రెండు రోజులు సర్దుబాటు చేసుకొని ఆ తరువాత యూనిట్లు షట్‌డౌన్ చేశారు. పెద్ద కంపెనీలు డబ్బులు పెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుంటున్నాయి.

నిర్వహణ లేకపోవడం వల్లే సమస్య

పంప్‌హౌస్‌లో వాడే మోటార్లు శక్తివంతమైనవి, అరుదైనవి. వాటికి ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఏపీఐఐసీ అధికారులు నిర్వహణ గాలికి వదిలేశారు. దాంతో అవి ఒకదాని తరువాత మరొకటి మొండికేశాయి. పరిశ్రమలు రావాలని పిలుపునిస్తున్న ప్రభుత్వాలు అత్యంత ముఖ్యమైన నీటిని కూడా రోజుల తరబడి ఇవ్వలేని పరిస్థితి వస్తే ఎలాగని పారిశ్రామికవేత్తలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పునరుద్ధరించాం

నీటి సమస్య తలెత్తిన మాట వాస్తవమే. ఆ మోటార్లకు మరమ్మతులు చేసేవారు అందుబాటులో లేరు. కాకినాడ నుంచి మనుషులను రప్పించి చేయించాల్సి వచ్చింది. సమస్య బుధవారం సాయంత్రానికి పరిష్కారమైంది. నీటి సరఫరా ప్రారంభించాం. రాత్రికి అచ్యుతాపురం యూనిట్లకు కూడా అందిస్తాం. కొత్త పంపుల నిర్మాణానికి రూ.70 లక్షలతో ప్రతిపాదనలు పెట్టాం.

- హరిప్రసాద్, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ


రూ.కోట్ల ఆదాయం వస్తున్నా నిర్లక్ష్యం

పారిశ్రామిక పార్కులకు నీటిని సరఫరా చేస్తూ ఏపీఐఐసీ కోట్ల రూపాయల ఆదాయం ఆర్జిస్తోంది. పంపు హౌస్‌లు, మోటార్ల నిర్వహణ గాలికి వదిలేస్తోంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి వచ్చింది. బ్యాకప్ మోటార్లు ఉంచుకోవలసిన అవసరం ఉంది. కానీ పట్టించుకోలేదు. ఇప్పటికైనా మేల్కొనాలి.

- ఓ.నరేశ్‌కుమార్, వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్

విశాఖ డెయిరీపై సభాసంఘం

- అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని అసెంబ్లీలో ఎమ్మెల్యేల ఆరోపణ
- డెయిరీని రైతులకు కాకుండా చేసి ఓ కుటుంబం సొంత ఆస్తిలా ఉపయోగించుకుంటున్నదని విమర్శ



విశాఖపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీపై సభా సంఘం వేయాలని శాసనసభ నిర్ణయించింది. సభ్యుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నాక స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ నిర్ణయం తీసుకున్నారు. ముందుగా విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ విశాఖ డెయిరీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, డెయిరీని రైతులకు కాకుండా చేసి ఓ కుటుంబం సొంత ఆస్తిలా ఉపయోగించుకుంటున్నదని ఆరోపించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, డెయిరీలో చాలా అక్రమాలు ఉన్నాయని, వాటిని తొక్కి పెడుతున్నారన్నారు. అన్ని డెయిరీలు పాల సేకరణ ధర పెంచుతుంటే విశాఖ డెయిరీ తగ్గించి రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు. సొసైటీ కింద ఏర్పాటైన డెయిరీని కంపెనీగా మార్చేసి కొందరు తమ చేతుల్లో ఉంచుకున్నారని, రైతుల పేరుతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ చాలాకాలంగా విశాఖ డెయిరీలో ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయని, విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించి, సభ్యుల సూచన మేరకు సభాసంఘం వేస్తున్నామని చెప్పారు.

ఇసుక సరఫరాపై విజి'లెన్స్'

- విమానాశ్రయంలో నిర్మాణాలకు నాసిరకం సరఫరా?

విశాఖపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయంలో జరుగుతున్న సివిల్ పనులకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని తెలిసి విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించి లారీలను పట్టుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. రక్షణ రంగ నిర్మాణాలకు నాణ్యమైన ఇసుకను వినియోగించాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా, సరైన పత్రాలు లేకుండా నాసిరకం ఇసుకను సరఫరా చేస్తున్నట్టు తెలిసింది. దీనిపై మైనింగ్ అధికారులు కూడా విచారణ చేపడితే పూర్తి వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.



జీతాలు చెల్లించాలని కోరుతూ బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఉక్కు ఉద్యోగుల కుటుంబీకులు

ఉక్కు ఉద్యోగులకు అందని వేతనాలు

సెప్టెంబరు జీతం 50%, అక్టోబరు జీతం 35% ఇచ్చిన యాజమాన్యం

- మిగిలిన మొత్తం ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి
- మరోవైపు రుణ మంజూరును నిలిపివేసిన త్రిఫ్ట్ సొసైటీ
- అల్లాడిపోతున్న ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని విధంగా విశాఖ స్టీల్ ప్లాంటు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు జీతాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. సెప్టెంబరు నెల జీతంలో 50 శాతం, అక్టోబరు నెల జీతంలో కేవలం 35 శాతం మాత్రమే ఇచ్చి యాజమాన్యం చేతులు దులిపేసుకుంది. అంతకుముందు కొద్దినెలలు ఉద్యోగులకు రెండు వాయిదాల్లో పూర్తి జీతం ఇచ్చేవారు. పదో తేదీలోగా సగం, మిగిలిన సగం 20వ తేదీలోగా చెల్లించేవారు. కానీ రెండు నెలల నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఉద్యోగులకు పూర్తి జీతం రాకపోవడంతో వారి జీవితాలు తలకిందులవుతున్నాయి. ఈఎంఐలు చెల్లించాల్సిన వారు బ్యాంకు డిఫాల్టర్లుగా మారుతున్నారు.

రుణాలకూ చెల్లు చీటీ?

ఇదిలావుండగా స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు త్రిఫ్ట్ (విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ)లో సభ్యులుగా ఉంటారు. చాలామంది సొసైటీలో రుణాలు తీసుకోవడం సహజం. ఈ రుణ రికవరీ కూడా వారి జీతాల్లోంచే జరుగుతుంటుంది. అయితే గత కొద్దినెలలుగా ఉద్యోగుల జీతాల నుంచి ... మిగతా 6వ పేజీలో

నిరుపేదలకు ఆరోగ్య రక్ష

ఆయుష్మాన్ భారత్ పేరుతో కేంద్ర పథకం



విశాఖపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):

నిరుపేదలకు ఆరోగ్య భరోసాను కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా లబ్ధిదారులకు రూ.5 లక్షల విలువజేసే వైద్యాన్ని ఉచితంగా అందించనుంది. పథకానికి సంబంధించి గతంలోనే అర్హుల ఎంపిక ప్రక్రియను చేపట్టారు. మిగిలిన వారికి కొద్దిరోజుల్లో ఇంటింటి సర్వేను నిర్వహించి ఎంపిక చేయనున్నారు.

- ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం
- ఇప్పటివరకూ జిల్లాలో 2,44,192 కుటుంబాలు గుర్తింపు
- లబ్ధిదారుల సంఖ్య 9,11,734
- 6,33,742 మందికి ఈకేవైసీ పూర్తి
- 16,806 మందికి కార్డులు కూడా రాక...6,710 పంపిణీ
- దారిద్ర్య రేఖకు ఎగువనున్నా 70 దాటిన వారంతా ఈ పథకానికి అర్హులే

ఇప్పటివరకూ పూర్తిచేసిన ప్రక్రియ మేరకు జిల్లాలో ఆయుష్మాన్ భారత్ పథకానికి 2,44,192 కుటుంబాలు అర్హత సాధించగా, 9,11,734 మంది కుటుంబ సభ్యులున్నారు. వీరిలో 6,33,742 మందికి ఈకేవైసీ ప్రక్రియను స్థానిక సచివాలయ/వార్డు సిబ్బంది పూర్తిచేశారు. లబ్ధిదారులకు అందించేందుకు ఎన్టీఆర్ వైద్య సేవ కార్యాలయానికి 16,806 ఆయుష్మాన్ భారత్ కార్డులు రాగా, వీటిని జిల్లాలోని అర్బన్ హెల్త్ సెంటర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేశారు. అక్కడి సిబ్బంది 6,710 మందికి కార్డులను అందించారు. మిగిలిన కార్డులను పంపిణీ చేయాల్సి ఉందని చెబుతున్నారు. కొద్దిరోజుల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు.

రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం

ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఉచితంగా రూ.5 లక్షల వరకు విలువచేసే వైద్యాన్ని అందిస్తారు. జిల్లాలో ఆయుష్మాన్ భారత్ నెట్‌వర్క్ పరిధిలో 87 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ... మిగతా 6వ పేజీలో

పోర్టుకు భారీ నౌకల రాక



విశాఖ పోర్టుకు వచ్చిన భారీ వాణిజ్య నౌక (ఫైల్ ఫొటో)

విశాఖ విశాఖపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టుకు ఇటీవల కాలంలో భారీ నౌకల రాక పెరుగుతోంది. పోర్టు లోపలకు నౌకలు వచ్చే ఛానల్ లోతు(డ్రాఫ్ట్)ను డ్రెడ్జింగ్ ద్వారా పెంచడం, అలాగే బెర్తుల వద్ద ఎక్కువ లోతు చేయడంతో భారీ నౌకల రాకపోకలకు మార్గం సుగమమైంది. ఈక్యు 6 బెర్తు లోతును 11 మీటర్ల నుంచి 11.5 మీటర్లకు పెంచారు. అలాగే డబ్ల్యుక్యు 4, 5 బెర్తుల లోతును కూడా 11.5 మీటర్లకు పెంచారు. డబ్ల్యుక్యు 1, 2, 3 బెర్తుల లోతును 13 మీటర్ల నుంచి 13.5 మీటర్లకు పెంచారు. కంటెయినర్ టెర్మినల్‌లో అయితే 15 మీటర్ల నుంచి 16 మీటర్లకు పెంచారు. నౌకల నిర్వహణ సామర్థ్యం కూడా పెరిగింది. ఇన్నర్ హార్బర్ వద్ద ఏడు బేబీ కేప్ నౌకలు, సింగిల్ పాయింట్ మూరింగ్ (ఆయిల్) బెర్త్ వద్ద 15 నౌకలు, ఓర్ బెర్త్ వద్ద 10 కేప్‌సైజ్ నౌకలు పెట్టుకునే వెసులుబాటు ఉంది. పైలట్ల కొరత ఉన్నప్పటికీ మెరైన్ విభాగం ఇబ్బందులను అధిగమించి భారీ నౌకలను విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ నెల 12వ తేదీన కంటెయినర్ టెర్మినల్‌కు 366 మీటర్ల పొడవైన కంటెయినర్ నౌక ఎంఎస్‌సీ టొపాజ్, నవంబరు 9న 185.6 మీటర్ల పొడవైన ఎంవీ టోండా నౌక వచ్చాయి. అలాగే భారత నౌకాదళం కోసం షిప్‌యార్డు నిర్మించిన అతి పెద్ద ఫ్లోటింగ్ డాక్ (179.9 మీటర్లు)ను విజయవంతంగా తరలించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21న 262 మీటర్ల పొడవైన ఐఎన్ఎస్ విక్రాంత్ కంటెయినర్ టెర్మినల్‌కు వచ్చింది. ఏప్రిల్ 28న ప్రపంచంలోనే అత్యుత్తమ క్రూయిజ్ నౌక 'ది వరల్డ్' పోర్టు కొత్తగా నిర్మించిన క్రూయిజ్ టెర్మినల్‌కు వచ్చింది. ఇలా అనేక భారీ నౌకలు రావడం సంతోషంగా ఉందని పోర్టు వర్గాలు తెలిపాయి.

టీడీపీ సభ్యత్వ నమోదు

మధురవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు మధురవాడ వాంబే కాలనీలో బుధవారం టీడీపీ సభ్యత్వం నమోదు చేపట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, వార్డు ప్రధాన కార్యదర్శి కానూరి అచ్చుతరావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, విశాఖ పార్లమెంటరీ కార్యదర్శి సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు ప్రసాదాలు అందజేశారు.

యువ ఉత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ

భీమునిపట్నం,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన యువ ఉత్సవ్‌లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన థింసా నృత్యానికి ద్వితీయ స్థానం లభించింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి విజేతలను, తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు.

మద్దిలో రీసర్వే గ్రామ సభ

పద్మనాభం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామంలో భూముల రీ సర్వే గ్రామ సభలో అధికారులు రైతుల నుంచి 262 దరఖాస్తులు స్వీకరించారు. అత్యధికంగా పేర్లు సవరణకు 227, విస్తీరణ సవరణకు 32, ఇతర సమస్యలకు 3 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె. నగేష్‌కుమార్, డీటీ వరలక్ష్మి, ఆర్ఐ శ్యామల పాల్గొన్నారు.

పాండ్రంగిలో 'పొలం పిలుస్తోంది'

పద్మనాభం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాండ్రంగి గ్రామంలో వ్యవసాయాధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ విజయ ప్రసాద్ వరి కోసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అలాగే రబీలో చోడి పంటను అధిక విస్తీర్ణంలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ చలం, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ మేరీకుమారి పాల్గొన్నారు.

గెడ్డ స్థలంలో అక్రమ నిర్మాణాలు

- రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
- పట్టని అధికారులు

ఆనందపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం పంచాయతీలో ఉన్న గెడ్డ స్థలంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ పంచాయతీ జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో ఇక్కడ చిన్న స్థలానికి కూడా లక్షల్లో ధర పలుకుతోంది. దీంతో ఎక్కడ ఖాళీ జాగా కనిపించినా.. ఆక్రమణదారులు విడిచి పెట్టడం లేదు. ప్రస్తుతం సర్వే నెంబరు 173లో ఉన్న గెడ్డ పూర్తిగా ఆక్రమణకు గురైంది. గెడ్డ స్థలాన్ని ఆక్రమించి సుమారు 20 ఇళ్లు నిర్మించారు. వాటికి అధికారులు ఇంటి పన్ను, విద్యుత్ మీటర్లు ఇవ్వడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఇటీవల జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక కోటి రూపాయల విలువ చేసే గెడ్డ పోరంబోకు స్థలాన్ని కొంతమంది ఆక్రమించి, పునాదులు కూడా తవ్వారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కాగా ఈ విషయమై తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌ను వివరణ కోరగా స్థలాన్ని పరిశీలించి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.


గెడ్డలో భవన నిర్మాణానికి తీసిన పునాదులు

ఏడాకుల చెట్లు తొలగించాలని వినతి

సాగర్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి, మానవాళికి హాని కలిగించే ఏడాకుల చెట్లను తొలగించాలని 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, జనసేన నాయకుడు శాఖరి శ్రీనివాస్ కోరారు. బుధవారం వారు జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. వారితో పాటు కూటమి నాయకులు సుంకర హరి, సుంకర రమేశ్, లొడగల వాసు ఉన్నారు.

అప్పన్నకు 108 బియ్యం బస్తాలు విరాళం

సింహాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు సినీ నిర్మాణ, వారాహి సంస్థ అధినేత కొర్రపాటి సాయి వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి 108 బస్తాల బియ్యం విరాళంగా అందజేశారు. ఒక్కొక్క బస్తా 25 కిలోలు చొప్పున లక్ష రూపాయల విలువ గల బియ్యం బస్తాలను నిర్మాత ప్రతినిధి ఆలయ పర్యవేక్షణాధికారి ప్రసాద్‌కు ఇచ్చారు.

సికిల్‌సెల్ వ్యాధిపై అప్రమత్తం

సాగర్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లల్లో సికిల్ సెల్ వ్యాధి అధికంగా వ్యాపిస్తుందని, దీన్ని ముందుగా గుర్తిస్తే నయం చేయడం సాధ్యమని ప్రముఖ వైద్యుడు ధర్మారావు తెలిపారు. రుషికొండలో గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణా మిషన్ భవన్‌లో నిర్వహిస్తున్న జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా బుధవారం సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు గురించి వివరించారు. గిరిజన సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణిమందా మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఈ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు.

సంప్రదాయబద్ధంగా సంక్షిప్త రామాయణ హవనం


హవనం చేస్తున్న రుత్విక్‌లు

సింహాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై సీతారామస్వామి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతినెలలో వచ్చే శ్రీరాముడి జన్మ నక్షత్రం పునర్వసు పురస్కరించుకుని సంక్షిప్త రామాయణ హవనం నిర్వహించడం ఆనయివాతీ. ఈమేరకు వేకువజామున సుప్రభాతసేవలు తరువాత ఉత్సవమూర్తులు సీతారాములతో పాటు లక్ష్మ, ఆంజనేయులను పుష్పమాలికలతో అలంకరించిన ప్రత్యేక వేదికపై ఉంచారు. లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో శ్రీకారం చుట్టి హవనాన్ని జరిపారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ

సాగర్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకం మానవాళికి హానికరమని 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి అన్నారు. బుధవారం సాగర్‌నగర్ కూడలిలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా ప్రతిఒక్కరూ గుడ్డ సంచులు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బి. దొరబాబు, సాగర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీరామవర్మ, బొడ్డు శ్రీనివాస్, శానటరీ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

రామవరం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు


మాట్లాడుతున్న పలు గ్రామాల సర్పంచులు

ఆనందపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామవరం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 1.6 కోట్ల ఉపాధి నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా టీడీపీ మండల నాయకులు తాత్రాజు అప్పారావు, బీఆర్‌బీ నాయుడు, గంధ్రెడ్డి రమేశ్, యర్రా రాజు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వివిధ పంచాయతీల్లో రూ. 7.5తో బిటి, సీసీ రోడ్లు నిర్మించనున్నట్టు తెలిపారు. దబ్బంద, అరిగిమెరక, ఆకులవారికళ్లాలు, రామవరం, గంభీరం, దొంతలవారికళ్లాలులకు బిటి రోడ్లు, పాలవలస, ఎల్‌వీపాలెం, గంభీరం, పేకేరు, వేములవలస, తర్లువాడ పంచాయతీలకు సీసీ రోడ్లు మంజూరైనట్టు చెప్పారు. విలేకరుల సమావేశంలో వారితో పాటు పలు గ్రామాల సర్పంచులు ఉన్నారు.

బోరవానిపాలెంలో త్రుటిలో తప్పి ప్రమాదం

ఎండాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ జాతీయ రహదారిపై బోరవానిపాలెంలో బుధవారం నాలుగు వాహనాలు ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. మారికవలస నుంచి ఆనందపురం వైపు వె ళ్లున్న కారు రహదారిపై ఒక్కసారిగా ఆగిపోవడంతో అదే మార్గంలో వస్తున్న లారీ కారును ఢీకొంది. అదే సమయంలో ఫార్మా ఉద్యోగులతో వెళ్తున్న బస్సు లారీని, ఆ వెనుక పాఠశాల బస్సు ఫార్మా బస్సును ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఫార్మా సంస్థకు చెందిన ఉద్యోగులకు స్వల్ప గాయాలయ్యాయి.

కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం

తగరపువలస,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం చేయనున్నట్టు సీఐయూటీ నాయకులు తెలిపారు. బుధవారం వారు చిట్టివలసలో ఉన్న ఆ సంఘం కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీటూ మండల కార్యదర్శి మూర్తి మాట్లాడుతూ కార్మికులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఈనెల 26న జీవీఎంసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జోన్ నాయకులు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల అభివృద్ధికి కృషి

పద్మనాభం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ సహకార యూనియన్ రాష్ట్ర సహకార విద్యాధికారి జి. సోమేశ్వరరావు చెప్పారు. రెడ్డిపల్లి పీఏసీఎస్‌లో బుధవారం జరిగిన 71వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార రంగాన్ని ప్రజలకు చేరువ చేయడానికి కృషి చేస్తున్నాయన్నారు. ఇప్పటికే అన్ని పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేయడంతో పాటు ప్రతి గ్రామంలో సంఘం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్లు ప్రసాద్, శ్రీనివాసరావు, వెంకట అప్పారావు, సత్యమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

'వీసాలకు దళారులను నమ్మొద్దు'

సాగర్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసానికి వచ్చే యువత వీసాల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయం కాన్సుల్ ఇన్ఫర్మేషన్ యూనిట్ విభాగాధిపతి ఎస్. జెన్నె సూచించారు. అమెరికాలో ఉన్నత చదువులకు వీసా పొందే విధానంపై గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అమెరికాలో 4500 గుర్తింపు పొందిన విద్యా సంస్థలు ఉన్నాయని, వాటిలో ప్రవేశానికి ఆసక్తి గల వారు హైదరాబాద్‌లోని కాన్సులేట్ కార్యాలయంలో ఎఫ్ 1 వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దేశంలో 33 కేంద్రాల ద్వారా వీసా మంజూరు చేస్తున్నామని తెలిపారు.

పోలి పాడ్యమి ఉత్సవానికి సన్నాహాలు

సింహాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న సన్నిధిలో వచ్చే నెల 2న జరిగే పోలిపాడ్యమికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ వేంద్ర త్రినాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి 1 గంట నుంచి మహిళలు వరాహ పుష్కరిణిలో దీపాలు వదిలేందుకు అవకాశం ఉందని, ఈమేరకు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

మత్స్యకారుల రిలే దీక్షకు సీపీఎం మద్దతు


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు మూర్తి

భీమునిపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శ్మశాన వాటికను ఆక్రమణదారుల నుంచి కాపాడుకోవడానికి మత్స్యకారులు రిలే దీక్షలు చేయడం బాధాకరమని సీపీఎం నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి అన్నారు.జోనల్ కార్యాలయం ఎదుట ఏడు రోజులుగా జరుగుతున్న మత్స్యకారుల రిలే దీక్షా శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్మశాన వాటికను కాపాడుకోవడానికి మత్స్యకారులు కుటుంబ సమేతంగా దీక్షలకు దిగడం విచారకరమన్నారు. అధికారులు స్పందించి మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గంటా నూకరాజు, అల్లిపిల్లి నరసింగరావు, పిసి అప్పారావు, బర్రి కొండబాబు, వాసుపల్లి గరగయ్య, వాసుపల్లి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

గణిత బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ


మాట్లాడుతున్న డైట్ లెక్చరర్ నాగేశ్వరరావు

భీమునిపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గణితంలో విద్యార్థుల వేగాన్ని పెంపొందించేలా, కచ్చితత్వాన్ని పాటించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని డైట్ కళాశాల సీనియరు లెక్చరర్ జీజీఎస్ నాగేశ్వరరావు చెప్పారు. పట్టణంలోని జీవీఎంసీ పొట్టిశ్రీరాములు మునిసిపల్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు బుధవా రంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణి తంలో బోధనపై పలు అంశాలను వివరించారు. వచ్చే నెలలో జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి గణితంలో జామెట్రీలో ప్రాథమిక భావనలపై దృష్టిసారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శివరాణి, జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన


కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తాటితూరు గ్రామంలో ఉత్తమ యాజమాన్య పద్ధతుల్లో సాగు చేసిన వరి పంటను ఏఓ శివకోమలి, వ్యవసాయ శాఖ ఇంటర్నల్ పరిశీలకులు ఎస్.మాధురి, ఫీల్డ్ అధికారి స్వాతి బుధవారం పరిశీలించారు. ఈ గ్రామంలో పది మంది రైతులను ఎంపిక చేసి వారికి ప్రత్యేక విత్తనాలు అం దించి వరి సాగు చేయించారు. వీటి దిగుబడి పరిశీలించడానికి కోత కోయించి, ఒక్కొ రైతు నుంచి కిలో చొప్పున నమూనా ధాన్యాన్ని సేకరించారు వీటిని బెంగళూరులో పరిశోధనా కేంద్రానికి పంపిస్తామని ఏఓ చెప్పారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో బాలికల ప్రతిభ

కొమ్మాది, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది గురుకుల ప్రతిభా పాఠశాల విద్యార్థినులు ఏవీఎన్ కళాశాలలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపారు. ఆ కళాశాలలో యువ ఉత్సవ్‌లో భాగంగా మంగళవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో గురుకుల బాలికల పాఠశాలకు చెందిన 9, 10,ఇంటర్ విద్యార్థినులు మొదటి బహుమతి, ఐసీటీ విభాగంలో ద్వితీయ బహుమతి పొందారు. బాలికలను ప్రిన్సిపాల్ శాంతకుమారి అభినందించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

సింహాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) :అడివివరం శాఖా గ్రంథాలయంలో ఈనెల 19 నుంచి జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. వారం రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లోని విజేతలకు చివరి రోజు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ స్థల దాత దాసరి సన్యాసయ్యశెట్టి, సింహాచలం దేవస్థానం విశ్రాంత ప్రధానార్చకుడు గొడవర్తి గోపాలకృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఐఐఎం సీనియర్ లైబ్రీ ఇన్ఫర్మేషన్ అధికారి డాక్టర్ ఎస్.ఎన్.విఘ్నేశ్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లా డారు. గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలు అని, వాటిని ఎంత ఉపయోగించుకుంటే అంత జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం గ్రంథాలయాన్ని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు ఇందు, స్వాతి, శ్రీను, కనక మహేశ్వరి, అప్పారావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఆధునిక సాంకేతికతను జోడిస్తూ గ్రంథాలయాలను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లోని విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.

సింహగిరిపై దాత పేరుతో శిలాఫలకం


దక్షిణ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం

సింహాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి దక్షిణ రాజగోపురం ఎదురుగా దాత పేరుతో శిలాఫలకం ఏర్పాటు చేయడాన్ని పలువురు తప్పు పడుతున్నారు. ఎందరో దాతలు స్వామివారికి ఎంత విరాళం ఇచ్చినప్పటికీ సింహగిరిపై ప్రైవేటు వ్యక్తుల పేర్లతో ఇప్పటివరకు శిలాఫలకం ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. మొదటిసారిగా దక్షిణ రాజగోపురం నుంచి అన్నప్రసాద భవనానికి వెళ్లే మార్గంలో ఉన్న షెడ్ వద్ద దాత పేరుతో శిలాఫకలం ఏర్పాటు చేశారు. అందులో కనీసం దేవాలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు,ఈఓ పేర్లు కానీ లేవు. నిత్యం అటుగా వెళ్లే దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు దీన్ని పట్టించుకోకపోవడం పట్ల భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించిన కలెక్టర్

కొమ్మాది, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రీడల అభివృద్ధికి అన్ని విభాగాల కోచ్‌లు శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన కొమ్మాదిలోని స్పోర్ట్సు కాంప్లెక్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్‌లోని మైదానాల అభివృద్ధి, మౌలిక వసతులు తదితర వాటిని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిణి జూన్ గ్యాలియట్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భీమిలి ఆర్‌డీఓ సంగీత్ మాధుర్, శాప్ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేష్, చినగదిలి మండల డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత స్థలాలను పరిశీలించిన జేసీ

భీమునిపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నిషేధిత సెక్షన్ 22ఏలో వున్న స్థలాలను జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ బుధవారం పరిశీలించారు. సీబీఎం హైస్కూల్ రోడ్‌లో మునిసిపల్ మహాత్మాగాంధీ కల్యాణ మండపాన్ని ఆనుకుని వున్న స్థలాన్ని, తగరపువలస సమీపంలో చిట్టివలస పెద్ద చెరువు ఎదురుగా వున్న స్థలాన్ని జేసీ పరిశీలించారు. ఆయనతో పాటు ఆర్డీవో సంగీత్ మాధుర్, తహసీల్దార్ రామారావు, జడ్పీ ప్రసన్నవాణి ఉన్నారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు : డీఈఓ


స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్ కుమార్

సింహాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే విద్యార్థులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని డీఈఓ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఫిజికల్ సైన్స్ స్కూల్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సమాజ అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు అప్‌డేట్ కావాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులను పలు పాఠ్యాంశాల్లో ప్రశ్నించి ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఆయనతో పాటు హెచ్‌ఎం ఇమంది పైడిరాజు ఉన్నారు.

గొల్లల ఎండాడ పాఠశాలలో..

ఎండాడ : గొల్లల ఎండాడ ప్రాథమిక పాఠశాలను డీఈఓ ప్రేమ్‌కుమార్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధన తీరుతో పాటు విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. ఆయనతో పాటు ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ ఉన్నారు.

ఆర్కే బీచ్ రోడ్డుకు అదనపు ఆకర్షణ

... 5వ పేజీ తరువాయి

పూర్తి చేసి పర్యాటకులకు కానుకగా ఇవ్వాలని భావిస్తున్నారు. ఈ హెలికాప్టర్‌ను ఐఎన్ఎస్ డేగాలోనే భాగాలుగా విడదీసి రెండు ట్రాలర్లలో బుధవారం ఆర్‌కే బీచ్‌రోడ్డుకు తీసుకువచ్చారు. వాటిని భారీ క్రేన్ సాయంతో కేటాయించిన స్థలంలో పెట్టారు. ముందు హెలికాప్టర్ భాగాలన్నీ కలిపి, రూపం తీసుకువచ్చాక, తరువాత చుట్టూ సివిల్ పనులు చేపట్టనున్నారు.

తీర్థయాత్రల రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

డిసెంబరు 22 తర్వాత బెర్తులు అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు విశాఖ-ఎల్‌టీటీ వయా సికింద్రాబాద్ (18519), కోణార్క్ (11020) ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మన్మాడ్ వరకు వెళ్లే అవకాశం ఉన్నా షిర్డీ భక్తులు ఆసక్తి చూపడం లేదు. కుటుంబ సమేతంగా షిర్డీ వెళ్లేవారికి వారానికి ఒక్కరోజు మాత్రమే అందుబాటులో ఉన్న షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503) అనుకూలంగా ఉన్న నేపథ్యంలో షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను బైవీక్లీగా నడపాలని డిమాండ్ కూడా చాలాకాలం నుంచి ఉంది. రైల్వే అధికారులు దృష్టి సారించి షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను బై వీక్లీగా మార్చాలని కోరుతున్నారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు నెలాఖరు వరకు ఫుల్

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 28 వరకు అన్ని తరగతుల బెర్తులు నిండిపోయాయి. డిసెంబరు 30, 31 తేదీల్లో ఫస్ట్ ఏసీలో కొన్ని బెర్తులు, జనవరిలో సంక్రాంతి పండుగ సమయంలో మూడు రోజులు కూడా ఏసీ బెర్తులు మాత్రమే లభిస్తున్నాయి. ప్రతి శనివారం భువనేశ్వర్‌లో బయలుదేరి విశాఖ మీదుగా తిరుపతి వెళ్లే భువనేశ్వర్-తిరుపతి (22879)లో జనవరి 18 వరకు, ప్రతి ఆదివారం విశాఖ మీదుగా భువనేశ్వర్ నుంచి తిరుపతి వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22871)కు జనవరి 5 వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు. విశాఖ మీదుగా ప్రతిరోజు నడిచే హౌరా-యశ్వంత్‌పూర్ (12863) ఎక్స్‌ప్రెస్‌తోపాటు ఖరగ్‌పూర్-విల్లుపురం (22603), వివేక్ ఎక్స్‌ప్రెస్ (22815), పురిలియా-విల్లుపురం (22605), పూరి-తిరుపతి (17479), బిలాస్‌పూర్-తిరుపతి (17481), హటియా-బెంగళూరు (18637), భువనేశ్వర్-బెంగళూరు (12845), హౌరా-తిరుపతి హంసఫర్ (20889), సంత్రాగచ్చి-తిరుపతి (22855) వంటి వారాంతపు, బైవీక్లీ రైళ్లకు డిమాండ్ నెలకొంది. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో విశాఖ నుంచి బయలుదేరే డబల్ డెక్కర్ (22707) ఎక్స్‌ప్రెస్‌లో మాత్రం సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఉక్కు ఉద్యోగులకు అందని వేతనాలు

... 5వ పేజీ తరువాయి

రికవరీ చేసిన మొత్తం థ్రిఫ్ట్ సొసైటీకి జమ కావడం లేదు. రుణాల రికవరీ సక్రమంగా జరగకపోవడంతో ఉద్యోగులకు సొసైటీ రుణాలు మంజూరుచేయడం లేదు. దీంతో వారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. జీతాలు సక్రమంగా అందకపోవడంతో చాలామంది ఉద్యోగులు అప్పులు చేస్తున్నారు. ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పూర్తి జీతాలు చెల్లించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిరుపేదలకు ఆరోగ్య రక్ష

... 5వ పేజీ తరువాయి

పరిధిలో ఉన్న ఆస్పత్రులన్నీ ఈ పథకానికీ సేవలందిస్తున్నాయి. ఎన్టీఆర్ వైద్య సేవ కార్డులు కలిగిన కుటుంబాలు జిల్లాలో 4.3 లక్షలు ఉండగా, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఇప్పటివరకు తొలివిడతలో 2,44,192 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు.

ఇదీ ఎంపిక ప్రక్రియ..

ఆయుష్మాన్ భారత్ పథకానికి బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువనున్న) కుటుంబానికి చెందిన వారంతా అర్హులే. ఇప్పటికే లబ్ధిదారుల జాబితాను కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు అందించింది. వీరికి కార్డులను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే బీపీఎల్ పరిధిలో లేకపోయినా 70 ఏళ్లు దాటిన వారంతా ఈ పథకానికి అర్హులుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అర్హుల జాబితా వచ్చిన తరువాత క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం సర్వే చేస్తారు. యాప్‌లో వివరాలను పొందుపరుస్తారు. అనంతరం వారికి కార్డులు పంపిణీ చేస్తారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదుచేయడం ద్వారా కార్డు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. అర్హులైనప్పటికీ ఈ పథకానికి ఎంపిక కాకపోతే స్థానిక గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందిని సంప్రతించాలి.

కార్డుల పంపిణీకి చర్యలు

- డాక్టర్ అప్పారావు, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్

జిల్లాకు ఇప్పటివరకు వచ్చిన ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నాం. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలోని అన్ని ఆస్పత్రుల్లో ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్యసేవలు అందిస్తారు. ఇబ్బందులుంటే స్థానిక ఆరోగ్య, సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలి. రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో భాగంగా రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం పొందే వీలుంది.

☛ సంక్షిప్తంగా..

బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్‌కు ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తుతో పాటు రెండు ఫొటోలు, విద్యా, కుల, ఆదాయ, ఆధార్ ధ్రువపత్రాలను జత చేయాలని తెలిపారు. దరఖాస్తులను బీసీ స్టడీ సర్కిల్, సెక్టర్ 6, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నం వద్ద నేరుగా అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ 9492569177లో సంప్రదించాలనిపేర్కొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ జోన్-3 (ఆపరేషన్స్) ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరానగర్ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా చెట్ల నరికివేత, లైన్ మరమ్మతులు చేపడుతుండడంతో సరఫరా నిలిపి వేస్తున్నట్టు వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఇందిరానగర్, ఆదర్శనగర్,రాజీవ్‌నగర్, సుందరనగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏయూలో అమెరికా అల్లుడు హాస్య నాటిక ప్రదర్శన నేడు

వెంకోజీపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కేవీ గోపాలస్వామి ఆరుబయలు రంగస్థలంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం రంగస్థల విభాగం ఆధ్వర్యంలో 'అమెరికా అల్లుడు' హాస్యనాటిక ప్రదర్శిస్తున్నట్టు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ఓపెన్ ఎయిర్ థియేటర్లో ప్రదర్శించే ఈ నాటికను నగరవాసులందరూ హాజరై తిలకించాలని తెలిపారు. కార్యక్రమంలో ముందుగా కె.చంద్రరావు వేణుగానం, ఎంవీ సుబ్రహ్మణ్య హాస్యవల్లరి నిర్వహిస్తారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి విశాఖ డెయిరీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వేతన సవరణ, కనీస వేతనాలు అమలు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశాఖ డెయిరీ కార్మికులు గురువారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. గత 20 ఏళ్లుగా కార్మిక సంఘం లేని విశాఖ డెయిరీలో సీఐటీయూ ఆధ్వర్యంలో గత నెల ఏర్పడిన విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ నేతృత్వంలో తమ హక్కుల సాధన కోసం కార్మికులు దీక్షలకు దిగుతున్నారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 30, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 20, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 30, క్యారెట్ 60 దొండకాయలు 34, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోస కాయలు 25, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 55, పొటల్స్ 52, కీర దోస 26, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 75, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

ఆకతాయిలకు ఆవాసంగా శ్మశానం

- గంజాయి సేవించేందుకు అడ్డాగా మార్చుకొని ఆకతాయిచేష్టలు
- బోరువెల్, లైట్లు ధ్వంసం
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు, పోలీసులు



తుప్పలతో నిండిన శ్మశానంలో గంజాయి సేవిస్తున్న ఆకతాయిలు

వెంకోజీపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆకతాయిలు చిల్లర చేష్టలకు పాల్పడేందుకు ఏ ప్రాంతాలనూ వదలడం లేదు. చివరకు శ్మశానాన్ని సైతం వాడేస్తున్నారు. వీరిని అడ్డుకట్ట వేసే వారే లేకుండా పోవడంతో వీరి ఆగడాలకు అంతే లేకుండా పోతోంది. జీవీఎంసీ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెంలో స్మశాన వాటికలో ఈ పరిస్థితి నెలకొని ఉంది. పనిపాటా లేని కొందరు సోంబేరీలు సమయాలతో సంబంధం లేకుండా శ్మశానంలో గంజాయి పీల్చుతూ వీరంగం ప్రదర్శిస్తున్నారు.

పూర్వం నుంచి శ్రీసీతారామ సేవా సంఘం, గ్రామ సేవా సంఘం సభ్యులు ఈ శ్మశానాన్ని వినియోగిస్తూ వస్తున్నారు. ఆనాటి నుంచి వాడుకల్లో ఉన్నా ఈ శ్మశానం కనీస సదుపాయాలకు నోచుకోవడం లేదు. ఏవో కారణాలు చూపి కొందరు అడ్డంకులు సృష్టిస్తుండడమే ఇందుకు కారణం. అయితే ఈ రెండు సంఘాల చొరవతో శ్మశానంలో నాలుగేళ్ల క్రితం రెండు దహన షెడ్లు, శివుడి విగ్రహం నిర్మాణం చేపట్టారు. అయితే నిర్మానుష్యంగా ఉంటే శ్మశానం తమకు అనువైనదిగా భావించారో ఏమో ఆకతాయిలు తమ అడ్డాగా మార్చుకున్నారు. సాధారణంగా చీకటి పడితే శ్మశానానికి వెళ్లేందుకు ఎవరైనా వెనుకడుగు వేస్తారు. శాస్త్రం కూడా అదే చెబుతోంది. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు మాత్రమే శ్మశానంలో దహన సంస్కారాలు, మానవుల సంచారం చేయాలి. కానీ మత్తులో మునిగి తేలడమే పనిగా పెట్టుకున్న ఆకతాయిలు రాత్రి వేళల్లో కూడా శ్మశానాన్ని వదలడం లేదు. షెడ్లను ఆవాసంగా చేసుకొని యథేచ్ఛగా గంజాయి పీల్చుతూ ఆకతాయి చేష్టలకు పాల్పడుతుంటారు. తుప్పలు దట్టడంగా పెరగడం వీరికి కలిసి వస్తోంది. మత్తులో అక్కడ ఉన్న షెడ్ల రేకులను ధ్వంసం చేయడం, బోరువెల్‌ను విరగ్గొట్టడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా శ్మశానం బయట రోడ్డుపై ఉన్న విద్యుత్ దీపాలను ఎప్పటికప్పుడు పగులగొడుతుంటారు. ఆ ప్రాంతంలో వెలుతురు లేకుండా చేయడం వల్ల తమకు అనుకూలంగా చేసుకోవాలని అలా చేస్తుంటారు. దీంతో పాటు చీకటి పడితే చాలు కొత్త వెంకోజీపాలెం బస్టాప్ నుంచి పాత వెంకోజీపాలెంలోకి వచ్చే మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడం, చైన్‌స్నాచింగ్‌కు పాల్పడడం చేస్తున్నారు. వీరిని ఆగడాలను అరికట్టే చర్యలేవీ లేకపోవడంతో మరింతగా రెచ్చిపోతున్నారు. ఎవరైనా హితవు చెప్పేందుకు యత్నించినా అటువంటి వారిపై దాడులకు సైతం పాల్పడుతున్న సందర్భాలు ఉంటున్నాయి. పోలీసులు ఈ ప్రాంతంపై నిఘా పెంచి ఆకతాయిలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జీవీఎంసీ సహకరించడమే లేదు



శ్మశానంలో ఏ సౌకర్యాలు సొంతంగా ఏర్పాటు చేసుకుందామన్నా జీవీఎంసీ అధికారులు సహకరించడం లేదు. ఏవో అనుమతులు, కోర్టులో వ్యాజ్యం ఉందంటూ చెబుతున్నారు. గతంలో ఎందరో జీవీఎంసీ కమిషనర్‌లు ఈ ప్రాంతాన్ని పర్యటించినప్పుడు మా సమస్యను వివరించాం. ప్రజా సమస్యలను పట్టించుకోకుంటే ఎలా? ఇదేం విధానం? తుప్పలు, చెట్లు పెరిగిపోవడంతో ఆకతాయిలకు అనువుగా మారింది. ఇప్పటికైనా జీవీఎంసీ, పోలీసులు స్పందించాల్సిన అవసరం ఉంది?

\- పీల కనకరాజు, అధ్యక్షుడు, గ్రామ సేవా సంఘం

ఆకతాయిలను అరికట్టాలి



సాధారణ ప్రాంతంలోనే కాకుండా శ్మశానాన్ని సైతం ఆకతాయిలు వదలడం లేదు. జీవీఎంసీ ఈ శ్మశానంలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. స్థానిక సంఘాలు ఏవో సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నా, ఆకతాయిల దెబ్బకు అవి ధ్వంసం అవుతున్నాయి. ఈ విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇదిలా కొనసాగాల్సిందేనా..! ఇప్పటికైనా స్పందించాలి. అప్పుడే ఇబ్బందులు తొలగుతాయి.

\- ఆడారి పరదేశినాయుడు, అధ్యక్షులు, శ్రీ సీతారామసేవా సంఘం

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

మద్దిలపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న 57వ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాలలో గ్రంథాలయ పితమహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ కామర్స్ విభాగం ప్రొఫెసర్ బి.మోహనవెంకటరామ్ మాట్లాడుతూ పుస్తక పఠనం గొప్పతనాన్ని వివరించారు. ప్రతీ పుస్తకం కొత్త విషయాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వెళ్లడం అలవర్చుకోవాలన్నారు. గ్రంథాలయమే ఓ విజ్ఞాన బాండాగారమన్నారు. వ్యక్తిత్వ వికాసానికి పుస్తకాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు కె.రవిబాబు, శ్రావణ్‌కుమార్, రాజేశ్వరరావు, పోల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని నగర శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభను బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి విచ్చేశారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రత్యేక అతిథులుగా వైశ్యరాజు జ్యుయలర్స్ అధినేత నరేష్‌రాజు, కేబీఆర్ ఈవెంట్స్ అధినేత కె.బాబూరావు, గ్రంథాలయాధికారి కేవీవీ ఉమామహేశ్వరరావు, సామాజిక కార్యకర్త సత్యకుమార్, రచయిత సుసర్ల సర్వేశ్వర శాస్త్రి పాల్గొన్నారు.



ముగింపు వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు, వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులు

16వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలను సేకరిస్తున్న నారు గోపి, వాసు, మొల్లి శోభ తదితరులు

వెంకోజీపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డు కృష్ణా కళాశాల రోడ్డులో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు నారు గోపి, సీనియర్ నాయకులు ముగడ వాసుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ఈసారి సభ్యత్వాల సంఖ్యను మరింత పెరిగేలా చూడాలని నేతలు, కార్యకర్తలకు సూచించారు. కూటమి పాలన పట్ల ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారన్నారు. సభ్యత్వం తీసుకునే వారికి బీమా సదుపాయం ఉంటుందన్నారు. అనంతరం పలువురి నుంచి సభ్యత్వాలను స్వీకరించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొల్లి శోభ, మొల్లి శంకర్, జి.అప్పన్న, పల్లా ఉమారాణి, ఆర్.నూకరాజు, బి.బంగార్రాజు, ఎం.వాసు, ఆర్.భరత్‌కుమార్, కె.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్న రంగంలో ప్రోత్సహిస్తే సత్ఫలితాలు

- సీపీ శంఖబ్రత బాగ్చి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థికి ఆసక్తి ఉన్న రంగంలో ప్రోత్సాహం, శిక్షణ అందిస్తే ఆ విద్యార్థి ఉన్నత స్థానాలకు చేరే అవకాశం మెండుగా ఉంటుందని నగర పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చి పేర్కొన్నారు. బుధవారం దీనదయాళ్‌పురంలో గల ప్రభుత్వ బాలురగృహంలో నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న విషయంలో అభ్యసనం సాగిస్తే సులభంగా విషయం అర్థమవుతుందని, ఇది ఉన్నతం గా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. ఇక్కడ ఉన్న వారిలో ఐఏఎస్, ఐపీఎస్‌లు రావాలన్నారు. అలాజరిగితే ఎంతో సంతోషిస్తానన్నారు. ప్రతి విద్యార్థి రాత, చదవడం, అవగాహన చేసుకోవడంలో సమానమైన ప్రతిభ కలిగి ఉండాలన్నారు. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సబ్జెక్టులోని అంశాలను క్షుణ్ణంగా గుర్తుంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై దృష్టి సారించి బోధన చేయాలన్నారు. కేవలం విద్యా బోధనే కాకుండా విద్యార్థి మానసిక స్థితి, ఆరోగ్యం వంటి విషయాలను ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానంటూ ఆయన సెల్ నం.7995095799 ఇచ్చారు.

అనంతరం.. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమణ, ఈశ్వరీ ప్రజాహిత అక్క రామేశ్వరీ, ఐసీఐసీఐ బ్యాంకు విశ్రాంతి చీఫ్ మేనేజర్ మణిమాల, ఏపీ చైల్డ్ ప్రొటెక్షన్ సభ్యుడు గొండు సీతారాం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.రామలక్ష్మి, రాధ, సభ్యులు సూర్యనారాయణ, మందా రజనీ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల దినోత్సవం

అలాగే దీనదయాళ్‌పురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో బాలల హక్కుల వారోత్సవాలు ముగింపు సమావేశానికి సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యారులు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.

వాతావరణ మార్పులపై జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ

- మేయర్ హరి వెంకటకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటరమణ

వెంకోజీపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా నగరాల్లో గణనీయంగా వాతావరణం మార్పులు సంభవిస్తున్నాయని, ఇది ప్రజాజీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతోందని విశాఖ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ఇది నగరాలకు సవాలుగా మారిందని, ఈ నేపథ్యంలో విశాఖ నగర వాతావరణం మార్పుపై జీవీ ఎంసీ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందన్నారు. బుధవారం ఆమె జీవీఎంసీ అధ్వర్యంలో ఐసీఎల్‌ఈఐ ఆర్గనైజేషన్ క్లైమెట్ యాక్షన్‌పై రెసిలిఎన్స్ సిటీస్ ప్లానింగ్, ఆచరణ కోసం ఆంధ్రప్రదేశ్‌లో 3 నగరాలైన విశాఖ, విజయవాడ, కాకినాడ ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌నకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వాతావరణ మార్పు కారణంగా గ్లోబల్ టెంపరేచర్స్ పెరుగుతుండడంతో సముద్ర మట్టం పెరగడం, తీవ్ర వాతావరణ సంఘటనలు, వరదలు, కరువు, తుఫాన్లు, వాయు కాలుష్యం వంటి ప్రభావాలను పెంచుతుందన్నారు. ఇప్పటికే భారతదేశంలో గల నగరాలు వరదలు, తుపానులు, తీవ్రమైన శీతాకాలాలు, వేడి తరంగాలకు గురవుతున్నాయని, వీటి తీవ్రత పెరుగుతూ రావడం ఆందోళన కలిగిస్తుందన్నారు. విశాఖపట్నం ఒక తీరప్రాంత పరిశ్రమ నగరంగా పలు ప్రమాదాలు, విపత్తులకు గురవుతోందన్నారు. పరిస్థితులు క్లైమేట్ చేంజ్ ప్రభావాల వలన మరింత తీవ్రంగా మారుతున్నాయని ప్రజల రక్షణ దిశగా విశాఖ నగర క్లైమేట్ ఛేంజ్‌ను ఎదుర్కొనడానికి ప్రభుత్వం పలు అనుసరణ, నిరోధక చర్యలను తీసుకుంటుందన్నారు.

విశాఖ నగరం ఇప్పటికే పునరుత్పాదక శక్తి వనరుల వినియోగంలో ముందంజలో ఉందని, జీవీఎంసీ 13 మెగావాట్ల సోలార్ శక్తి గరిష్ఠ సామర్థ్యం కలిగిన ప్లాంట్లను నీటిపై, భూమిపై, రూఫ్‌టాప్‌లపై ఏర్పాటు చేసి గ్రీన్ ఎనర్జీ ద్వారా నగరానికి కావాల్సిన అవసరాలను సమకూర్చుకుంటోందన్నారు.

జీవీఎంసీ బీచ్ రోడ్డులో 3000 సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేసిందన్నారు. విశాఖలో 28శాతం గ్రీన్ కవర్ ఉందని మరింత పచ్చదనం ప్రజల సహకారంతో పెంపొందించేందుకు చర్యలు జీవీఎంసీ చేపడుతుందన్నారు. నగరంలో కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ బీచ్‌రోడ్డులో ప్రజా రవాణా కోసం ఉచితంగా ఈ ఆటోలు ప్రవేశపెట్టి, అలాగే ఇంటింటి నుంచి చెత్త సేకరణ కోసం 65 ఈ ఆటోలను వినియోగిస్తున్నామన్నారు. వీటితో పాటు విశాఖ నగరంలో చేపడుతున్న పలు కార్యక్రమాలను మేయర్ వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏయూ గ్రంథాలయంలో ఇన్ఫ్లిబినెట్ సేవలు



ఇన్ఫ్లిబినెట్ శాస్త్రవేత్త అభిషేక్ కుమార్‌ను అభినందిస్తున్న వీసీ

వెంకోజీపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏయూలో ఇన్ఫ్లిబినెట్ సేవలను పూర్తిస్థాయిలో విద్యార్థులకు, పరిశోధనలకు అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా ఏయూ అధికారులు ముందడుగు వేశారు. బుధవారం ఏయూకు విచ్చేసిన ఇన్ఫ్లిబినెట్ శాస్త్రవేత్త అభిషేక్‌కుమార్ ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావులతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇన్ఫ్లిబినెట్ అందిస్తున్న సేవలను వివరించారు. త్వరలో ఇన్ఫ్లిబినెట్‌తో అవగాహన ఒప్పందం చేసుకోవాలని ఏయూ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. దీనికి అవసరమైన చర్యలు, వేగవంతం చేయాలని గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లును సూచించారు.

బతుకు తెరువు చూపుతాడనుకుంటే..

చేతిలో బొచ్చె పెట్టాడు

- 22వ కార్పొరేటర్ మూర్తియాదవ్‌పై వీధి వ్యాపారుల ఆవేదన
- భిక్షాటన చేసి నిరసన



ధర్నా నిర్వహిస్తున్న 22వ వార్డు వీధి వ్యాపారులు

సిరిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా నష్టపోయానని, ఇదే తనకు చివరి అవకాశమని కాళ్లాచేతులు పట్టుకుని బతిమాలితే పీతల మూర్తి యాదవ్‌కు ఓటేశామని, ఆయన గెలుపునకు తమ వంతు కృషి చేశామని 22వ వార్డుకు చెందిన వీధి వ్యాపారులు పేర్కొన్నారు. తీరా గెలిచిన తర్వాత ఆయన తమకు బొచ్చె చేతిలో పెట్టి, బతుకులు దుర్భరం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదులో దుకాణాలు కోల్పోయిన వీధి వ్యాపారులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరు వ్యాపారుల పొట్టకొట్టిన పీతల మూర్తియాదవ్‌ను బర్తరఫ్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మూర్తియాదవ్ పెద్ద అక్రమార్కుడని ధ్వజమెత్తారు. వార్డులో పేదల బతుకులు బజారుకీడ్చి వార్డు బయట ఉత్తముడిగా చలామణీ అవుతున్నాడని మండిపడ్డారు. న్యాయవాది శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ వార్డు ప్రజల ఓట్లతో గెలిచిన మూర్తి యాదవ్ రోడ్లు, వీధిలైట్లు, కాలువలు, పరిశుభ్రత వంటి సమస్యలను గాలికొదిలేసి.. పేదలు, వీధి వ్యాపారులను ఇబ్బంది పెట్టడం దుర్మార్గమన్నారు. 2014లో ప్రధాని మోదీ ప్రభుత్వం చిరు వ్యాపారుల కోసం స్ట్రీట్‌వెండర్స్ యాక్ట్ తీసుకొచ్చిందని తెలిపారు. వార్డులోని ఉన్నత వ్యాపారుల లబ్ధి కోసం సహకరించే మూర్తి యాదవ్ చిరు వ్యాపారులపై మాత్రం కక్ష కట్టడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో తోపుడు బండ్ల దుకాణదారులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి గూగుల్ ప్రత్యామ్నాయం కాదు

- ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

వెంకోజీపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలంటే కేవలం పుస్తకాలే కాదని, ఒక జ్ఞానకేంద్రంగా నిలుస్తాయని ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అన్నారు. బుధవారం ప్లాటినం జూబ్లీ సమావేశాల్లో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ గ్రంథాలయానికి గూగుల్ ప్రత్యామ్నాయం కాదని చెప్పారు. ఆన్‌లైన్‌లో చదవడం వల్ల కేవలం 30 శాతం సమాచారం మాత్రమే గ్రహించగలమని, పుస్తకాలు చదివితే 70 శాతం వరకు జ్ఞానాన్ని గ్రహించగలమన్నారు. పుస్తక పఠనం అత్యుత్తమైన విధానమని, విద్యార్థులు దీన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తాము విద్యార్థిగా ఏయూలో చదివే సమయంలో అత్యధిక సమయాన్ని గ్రంథాలయంలో గడిపే వారమని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం గ్రంథాలయంలో విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. శోధ్ గంగాలో ఏయూ గ్రంథాలయం ఆరవ స్థానంలో నిలవడంపై అభినందనలు తెలిపారు. ఇక్కడ ఉన్న పుస్తకాలు ఈ-జర్నల్స్ ఇతర వనరులను సద్వినియోగం చేసుకోవాలని, పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గత వారం రోజులుగా నిర్వహించిన కార్యక్రమ వివరాలను ఆచార్య వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఇన్ఫ్లిబినెట్ శాస్త్రవేత్త అభిషేక్ కుమార్ వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయ వారోత్సవాల సమదస్సులోపాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

రోడ్డుకు అడ్డంగా చెట్టు

- కూలిపోయి మూడు రోజులైనా తొలగించని జీవీఎంసీ సిబ్బంది
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు



రోడ్డును ఆక్రమించి పడి ఉన్న చెట్టు

ఆరిలోవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల సూర్యతేజనగర్ బ్రిడ్జి సమీపంలో ఒక చెట్టు విరిగి రోడ్డునకు అడ్డంగా పడి ఉంది. దీనివల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడమే కాకుండా ప్రమాదాలు సంభవించే పరిస్థితి ఉంది. ఈ చెట్టు విరిగి సుమారు మూడురోజులు అవుతున్నా తొలగింపునకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో బిజీ సమయంలో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. రాత్రి సమయంలో ప్రమాదాలు సంభవించే పరిస్థితి నెలకొందని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ విరిగి పడి ఉన్న చెట్టు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

మసీదు రోడ్డులో అర్ధరాత్రి హంగామా!

పోలీసుల అండతో యథేచ్ఛగా వ్యాపారాలు



జగదాంబ జంక్షన్ వద్ద అర్ధరాత్రి ఆహారం విక్రయం

జగదాంబ కూడలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగదాంబ జంక్షన్ మసీదు ఏరియా ఫుడ్ స్టాల్స్ వద్ద అర్ధరాత్రి వరకు యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. నగర పరిధిలో ఎక్కడా లేని విధంగా సెకండ్ షో సినిమా తర్వాత వచ్చి నచ్చిన ఆహారం ఇక్కడ ఆరగించవచ్చు. పోలీసు జీపులు ఎన్నిసార్లు రయ్..రయ్ మంటూ తిరిగినా, ఇటువైపు చూసినా చూడనట్టే నటిస్తుంటారు. గత కొన్నేళ్లుగా పోలీసుల అండదండలతోనే ఇక్కడ అర్ధరాత్రి దాటే వరకు తోపుడు బళ్ల వద్ద కీమా, ఎగ్ దోశల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని స్థానిక నివాసితులు ఆరోపిస్తున్నారు. మసీదు ఏరియాలో మాంసాహారం, ఫాస్ట్‌ఫుడ్ స్టాల్స్ విపరీతంగా పెరిగిపోయాయి. రాత్రి 11 గంటల వరకు మాత్రమే విక్రయాలకు అనుమతి ఉన్నా... ఇక్కడ మాత్రం మినహా యింపు ఇచ్చేలా ఉంది పరిస్థితి. అర్ధరాత్రి దాటినా నచ్చిన ఆహారం దొరుకుతుండడంతో మసీదు రోడ్డు మందుబాబులకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. యువత ఈ స్టాల్స్ వద్ద గ్రూపులుగా మద్యం సేవిస్తున్నారు. దుకాణాలు మూసిన తర్వాత కొంత మంది మద్యం సీసాలతో ఇక్కడ ప్రత్యక్షమవుతున్నారని కొంత మంది వ్యాపారుల ఆరోపణ. మామూళ్లు, ఆహారం రుచి మరిగిన పోలీసులు ఇక్కడి వ్యాపారులను పల్లెత్తు మాట అనడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సమీప ప్రాంతాల్లో పాన్, టిఫిన్ దుకాణాలు తెరచి ఉంటే పోలీసులు ఆగమేఘాలపై వచ్చి మూయిస్తారు. మసీదు ప్రాంతంలోని దుకాణాల వద్దకు జీపుల్లో బందోబస్తు పోలీసులు వచ్చినా చర్యలు తీసుకోకపోవ డమేమిటని స్థానిక నివాసితులు ప్రశ్నిస్తున్నారు. దీనికి పోలీసులే సమాధానం చెప్పాల్సి ఉంది.

స్కూల్ గేమ్స్ జాతీయ కరాటే టోర్నీకి జగన్ ఎంపిక



జగన్‌ను అభినందిస్తున్న సతీష్‌కుమార్

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన ఎస్.జగన్ ఎంపిక య్యాడు. కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నీలో అండర్-19 కేటగిరీలో అద్భుతంగా రాణించి స్వర్ణ పతకాలు సాధించి డిసెంబరు 27 నుంచి బోపాల్‌లో జరిగే జాతీయ కరాటే పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా వాడో కై కరాటే డో అసోసియేషన్ అధ్యక్షుడు చిగురుపల్లి సతీష్‌కుమార్ బుధవారం తన కార్యాలయంలో జగన్‌ను అభినందించి జాతీయ టోర్నీలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించారు. కోచ్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీగా బమ్మిడి శ్రీనివాసరావు

మహారాణిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిటీ స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసుగా నియమితులైన బమ్మిడి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. 2012 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరావు నగర పోలీసు శాఖలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహించి అధికారుల మన్నన పొందారు.

ఉపవిద్యాశాఖాధికారికి సత్కారం



సోమేశ్వరరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కంచరపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ డీఈవోగా బాధ్యతలు చేపట్టిన అంబటి సోమేశ్వరరావును జ్యోతినగర్ ఎంఈవో కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయులు అభినందించారు. గోపాలపట్టణం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైవీఎస్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో కాంప్లెక్స్ పరిధిలోని ఆరు ఉన్నత పాఠశాలలు, 11 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని సోమేశ్వరరావును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వేణుగోపాల్ మాట్లాడుతూ డిప్యూటీ డీఈవోగా తనదైన ముద్ర వేసి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. మండలంలోని ఉపాధ్యాయులంతా పూర్తి స్థాయిలో సహకరిస్తామన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి: జేసీ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

జగదాంబ కూడలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయం వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు, మొబైల్‌తో కాలం వృథా చేయవద్దని హితవు పలికారు. పుస్తకాలు చదవడం వల్ల భవిష్యత్‌లో ఎన్నో విజయాలకు చేరువవుతారన్నారు. గ్రంథాలయాలు మనోవికాసానికి పట్టుకొమ్మలన్నారు. సాంకేతిక మార్పులు వచ్చినా, పుస్తక పఠనంతో ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, పాటల పోటీల్లో విజేతలు 42 మందికి జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్ వెంకటరావు, డివిజనల్ పీఆర్వో నారాయణరావు, ఎంఈవో పైడపునాయుడు, వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

గండి బాబ్జీ, పీవీజీ కుమార్‌లకు సత్కారం



టీడీపీ నేతలను సన్మానిస్తున్న బీసీ సంఘ నాయకులు

అక్కయ్యపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమితులైన గండి బాబ్జీ, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్‌గా నియమితులైన పీవీజీ కుమార్‌లను ఉత్తరాంధ్ర బీసీ సంఘం నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. మెట్రో పాలిటిన్ విశ్రాంత మేజిస్ట్రేట్ పైలా సన్నిబాబు, నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, వైజాగ్‌పటం క్లబ్, వాకర్స్ క్లబ్ సభ్యులు వారికి గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గొంప సత్యనారాయణ, వాసు, చిట్టిబాబు, సీనియర్ నాయకులు పంకజ్, బాపినాయుడు, విజయ్, కొండలరావు, మహేష్, ఈశ్వరరావు, గంటా అప్పలనాయుడు పాల్గొన్నారు.

'విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి'

సీతమ్మధార, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) విశాఖ జిల్లా కమిటీ ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కి వినతిపత్రం సమర్పించింది. కాంట్రాక్ట్ కార్మికులు రాత్రింబవళ్లు అతి తక్కువ జీతాలతో పనిచేస్తున్నారని, అయిదేళ్లుగా పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని పేర్కొన్నారు. జెన్కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని, సమాన వేతనం ఇవ్వాలని, 2022 పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, పనిచేస్తున్న కార్మికులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. యూనియన్ అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి కుమార్, అధ్యక్షులు కె.సత్యారావు, సెక్షన్ ఆపరేటర్స్ పరశురాం, మోహన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 33 మంది బాల కార్మికుల గుర్తింపు

డాబాగార్డెన్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కలెక్టర్ ఆదేశం మేరకు నెల రోజులు బాల కార్మికుల గుర్తింపు డ్రైవ్ చేపట్టామని ఉప కార్మిక కమిషనర్ తెలిపారు. నవంబరు 20 వరకు జిల్లా పరిధిలో 33 మంది బాల కార్మికులను గుర్తించామన్నారు. కేసులు నమోదు చేసి, యాజమాన్యాలు నుంచి రూ.1,26,325 జరిమానా వసూలు చేశామన్నారు. బాల కార్మికుల చట్టం కింద ఐదు దుకాణాలను గుర్తించి డిమాండ్ నోటీస్‌లు జారీ చేసి రూ.20 వేలు వంతున జరిమానా వసూలు చేసినట్లు పేర్కొన్నారు. బాల కార్మికుల చట్టం కింద 3 దుకాణాలపై రెండో అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు విశాఖపట్నం వద్ద 3 కేసులను ఫైల్ చేసినట్లు అధికారి పేర్కొన్నారు.

'ప్రజల హృదయాలే మంచి కథకు వేదిక'



సమావేశంలో మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్, వేదికపై డి.వి.సూర్యారావు, కె.జి. వేణు, దామరాజు విశాలాక్షి తదితరులు

సీతంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కథానికలు వాస్తవ జీవన సత్యాలు.. మంచి కథ ప్రజల హృదయాలలో కలకాలం నిలుస్తుందని సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో గ్రంథాలయ సొసైటీ, సహృదయ సాహితి సౌజన్యంతో బుధవారం నిర్వహించిన కథారచయితల గోష్ఠి ప్రేక్షకులను అలరించింది. విశ్లేషకులు డాక్టర్ డి.వి.సూర్యారావు, డాక్టర్ కె.జి. వేణు, ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, గన్నవరపు నరసింహమూర్తి, ఇందూరమణ, మల్లాప్రగడ రామారావు, దామరాజు విశాలాక్షిలు కథా రచయితల గోష్ఠి, కథానిక తదితర విశేషాలను విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో భాగవతుల సత్యనారాయణ మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు, డాక్టర్ కె.వి.ఎస్. మూర్తి, కొత్తూరు రమణ, ఉప్పల అప్పలరాజు, డాక్టర్ సిహెచ్ నిర్మలాదేవి, పరవస్తు ఫణిశయన సూరి పాల్గొన్నారు.

అత్యాచార నిందితులపై కఠిన చర్యకు డిమాండ్



నిరసన నినాదాలు చేస్తున్న మహిళా ప్రతినిధులు

అల్లిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖలో న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వంశీ, జగదీష్, ఆనంద్, రాజేష్‌లను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. బుధవారం అల్లిపురంలోని చలువతోట వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కె.వనజాక్షి, ఎండీ బేగంలు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు మళ్లీ జరగకుండా వంశీ, అతని స్నేహితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షురాలు ఎ.దేముడమ్మ, సభ్యులు బి.పుష్పలత, సీహెచ్ నూకాలమ్మ, భాను, కొండమ్మ, హేమలత, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

24న శెట్టిబలిజల వన సమారాధన



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సంఘాల ప్రతినిధులు

సీతంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజల ఐక్యతను చాటిచెప్పేలా కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాలతో ఈ నెల 24న కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శెట్టిబలిజ సీనియర్ నాయకుడు కట్టా మల్లేశ్వరరావు తెలిపారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ పంపిన ప్రతినిధులు చొల్లంగి వెంకటరమణ, గుత్తుల విజయ్‌కుమార్, రాయుడు శ్రీనివాస్, కుడిపూడి శ్రీనివాస్, రెడ్డి భగవాన్, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యా, రెడ్డి వెంకటేశ్వరరావులతో కలిసి ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం వనసమారాధన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 24న అమలాపురంలో సత్తెమ్మ తల్లి గుడి వద్ద కార్తీక వనసమారాధనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కడలి సుబ్బారావు, ఇల్లా వెంకటేశ్వరరావు, గుత్తుల తులసి పార్వతి, దొమ్మేటి భీమన్న, మట్టపర్తి నాగరాజు, అప్పారి గిరిబాబు, మట్టపర్తి గోపాలరావు, చెల్లిబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కందుల నాగరాజు

అల్లిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని 32వ వార్డు కార్పొరేటర్, జనసేన నేత కందుల నాగరాజు అన్నారు. అల్లిపురం చలువతోట ప్రాంతంలో బుధవారం మత్స్యకారుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్యకారుల సంఘం సభ్యురాలు చెల్లూరు నూకాలమ్మ, నాగభూషణ్, నల్లయ్య, చెల్లూరు బుజ్జి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ రద్దు చేయాల్సిందే'



పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

అక్కయ్యపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులను బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. తాటిచెట్లపాలెంలో ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించి, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, వీవోఏ, ఆర్పీలు, జాతీయ ఆరోగ్య మిషన్, సమగ్ర శిక్షాలో పని చేస్తున్నవారిని ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాల సంఘటిత ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, అప్పలరాజు, గౌరీష్, రమణ, శివ, శ్యాంసాన్ పాల్గొన్నారు.

మార్చి నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్ నంబరు మార్పు

విశాఖపట్నం, నవంబరు (ఆంధ్రజ్యోతి): విశాఖ-తిరుపతి/కడప మధ్య రాకపోకలు సాగించే తిరుమల ఎక్స్‌ప్రెస్‌తోపాటు మరికొన్ని రైళ్ల నంబర్లను మార్పు చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 17488 నంబరుతో విశాఖ నుంచి తిరుపతి/కడప వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్ వచ్చే ఏడాది మార్చి ఒకటి నుంచి 18521 నంబరుతో, తిరుగు ప్రయాణంలో 17487 నంబరుతో కడప/తిరుపతి నుంచి విశాఖ వచ్చే తిరుమల ఎక్స్‌ప్రెస్ మార్చి ఒకటి నుంచి 18522 నంబరుతో రాకపోకలు సాగిస్తాయి. అలాగే 18311 నంబరుతో నడిచే విశాఖ-బనారస్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ మార్చి 2 నుంచి 18523 నంబరుతో, తిరుగు ప్రయాణంలో 18312 నంబరుతో నడిచే బనారస్-విశాఖ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ మార్చి 3 నుంచి 18524 నంబరుతో నడుస్తాయి. ఇక 22701/22702 నంబర్లతో విశాఖ-గుంటూరు-విశాఖ మధ్య నడుస్తున్న ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మార్చి ఒకటి నుంచి 22875, 22976 నంబర్లతో, విశాఖ-కిరండోల్-విశాఖ మధ్య రాకపోకలు సాగిస్తున్న నైట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మార్చి ఒకటి నుంచి 18513, 18514 నంబర్లతో నడుస్తాయని పేర్కొన్నారు.

తీర్థయాత్రల రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

డిసెంబరు 22 తర్వాత బెర్తులు అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు విశాఖ-ఎల్‌టీటీ వయా సికింద్రాబాద్ (18519), కోణార్క్ (11020) ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మన్మాడ్ వరకు వెళ్లే అవకాశం ఉన్నా షిర్డీ భక్తులు ఆసక్తి చూపడం లేదు. కుటుంబ సమేతంగా షిర్డీ వెళ్లేవారికి వారానికి ఒక్కరోజు మాత్రమే అందుబాటులో ఉన్న షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503) అనుకూలంగా ఉన్న నేపథ్యంలో షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను బైవీక్లీగా నడపాలని డిమాండ్ కూడా చాలాకాలం నుంచి ఉంది. రైల్వే అధికారులు దృష్టి సారించి షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను బైవీక్లీగా మార్చాలని కోరుతున్నారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు నెలాఖరు వరకు ఫుల్

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 28 వరకు అన్ని తరగతుల బెర్తులు నిండిపోయాయి. డిసెంబరు 30, 31 తేదీల్లో ఫస్ట్ ఏసీలో కొన్ని బెర్తులు, జనవరిలో సంక్రాంతి పండుగ సమయంలో మూడు రోజులు కూడా ఏసీ బెర్తులు మాత్రమే లభిస్తున్నాయి. ప్రతి శనివారం భువనేశ్వర్‌లో బయలుదేరి విశాఖ మీదుగా తిరుపతి వెళ్లే భువనేశ్వర్-తిరుపతి (22879)లో జనవరి 18 వరకు, ప్రతి ఆదివారం విశాఖ మీదుగా భువనేశ్వర్ నుంచి తిరుపతి వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22871)కు జనవరి 5 వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు. విశాఖ మీదుగా ప్రతిరోజు నడిచే హౌరా-యశ్వంత్‌పూర్ (12863) ఎక్స్‌ప్రెస్‌తోపాటు ఖరగ్‌పూర్-విల్లుపురం (22603), వివేక్ ఎక్స్‌ప్రెస్ (22815), పురిలియా-విల్లుపురం (22605), పూరి-తిరుపతి (17479), బిలాస్‌పూర్-తిరుపతి (17481), హటియా-బెంగళూరు (18637), భువనేశ్వర్-బెంగళూరు (12845), హౌరా-తిరుపతి హంసఫర్ (20889), సంత్రాగచ్చి-తిరుపతి (22855) వంటి వారాంతపు, బైవీక్లీ రైళ్లకు డిమాండ్ నెలకొంది. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో విశాఖ నుంచి బయలుదేరే డబల్ డెక్కర్ (22707) ఎక్స్‌ప్రెస్‌లో మాత్రం సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఆర్కే బీచ్‌రోడ్డుకు అదనపు ఆకర్షణ

... 5వ పేజీ తరువాయి

పూర్తి చేసి పర్యాటకులకు కానుకగా ఇవ్వాలని భావిస్తున్నారు. ఈ హెలికాప్టర్‌ను ఐఎన్‌ఎస్ డేగాలోనే భాగాలుగా విడదీసి రెండు ట్రాలర్లలో బుధవారం ఆర్‌కే బీచ్‌రోడ్డుకు తీసుకువచ్చారు. వాటిని భారీ క్రేన్ సాయంతో కేటాయించిన స్థలంలో పెట్టారు. ముందు హెలికాప్టర్ భాగాలన్నీ కలిపి, రూపం తీసుకువచ్చాక, తరువాత చుట్టూ సివిల్ పనులు చేపట్టనున్నారు.

నిరుపేదలకు ఆరోగ్య రక్ష

... 5వ పేజీ తరువాయి

పరిధిలో ఉన్న ఆస్పత్రులన్నీ ఈ పథకానికీ సేవలందిస్తున్నాయి. ఎన్టీఆర్ వైద్య సేవ కార్డులు కలిగిన కుటుంబాలు జిల్లాలో 4.3 లక్షలు ఉండగా, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఇప్పటివరకు తొలివిడతలో 2,44,192 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు.

ఇదీ ఎంపిక ప్రక్రియ..

ఆయుష్మాన్ భారత్ పథకానికి బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువనున్న) కుటుంబానికిచెందిన వారంతా అర్హులే. ఇప్పటికే లబ్ధిదారుల జాబితాను కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు అందించింది. వీరికి కార్డులను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే బీపీఎల్ పరిధిలో లేకపోయినా 70 ఏళ్లు దాటిన వారంతా ఈ పథకానికి అర్హులుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అర్హుల జాబితా వచ్చిన తరువాత క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం సర్వే చేస్తారు. యాప్‌లో వివరాలను పొందుపరుస్తారు. అనంతరం వారికి కార్డులు పంపిణీ చేస్తారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదుచేయడం ద్వారా కార్డు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. అర్హులైనప్పటికీ ఈ పథకానికి ఎంపిక కాకపోతే స్థానిక గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందిని సంప్రతించాలి.

కార్డుల పంపిణీకి చర్యలు

జిల్లాకు ఇప్పటివరకు వచ్చిన ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నాం. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలోని అన్ని ఆస్పత్రుల్లో ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్యసేవలు అందిస్తారు. ఇబ్బందులుంటే స్థానిక ఆరోగ్య, సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలి. రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో భాగంగా రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం పొందే వీలుంది.

- డాక్టర్ అప్పారావు, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్

ఉక్కు ఉద్యోగులకు అందని వేతనాలు


... 5వ పేజీ తరువాయి

రికవరీ చేసిన మొత్తం థ్రిఫ్ట్ సొసైటీకి జమ కావడం లేదు. రుణాల రికవరీ సక్రమంగా జరగకపోవడంతో ఉద్యోగులకు సొసైటీ రుణాలు మంజూరుచేయడం లేదు. దీంతో వారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. జీతాలు సక్రమంగా అందకపోవడంతో చాలామంది ఉద్యోగులు అప్పులు చేస్తున్నారు. ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పూర్తి జీతాలు చెల్లించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు'

అల్లిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం చూపవద్దని జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం జోనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్జీదారులతో మర్యాదపూర్వకంగా ఉంటూ, వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి ప్రయత్నించాలని సూచించారు. అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను తప్పక పాటించాలన్నారు. ఆర్‌ఓ రతన్‌రాజు, ఏపీడీ పద్మావతి, ఆర్‌ఐలు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

గాయకుల ప్రతిభకు ప్రోత్సాహం



సత్కారం పొందిన గాయనీమణులతో అతిథులు

అక్కయ్యపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గాయనీమణుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు అన్నారు. ఘంటసాల స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ బుధవారం సాయంత్రం అక్కయ్యపాలెం స్వరాలయ స్టూడియోలో గాయనీ మణులు కోమలీ ప్రసాద్, మాధురి, సుజాతలతో 'వేణు గానమ్ము వినిపించెనే' శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ శ్రావ్యమైన గీతాలతో అలరించిన గాయకులను ప్రశంసించారు. అనంతరం గాయకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ సుహాసిని ఆనంద్, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, జి.త్యాగరాజన్, పి.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే వ్యాపారులకు జరిమానా

అక్కయ్యపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లను మానేసి గుడ్డ సంచులను వినియోగించాలని 45వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ వ్యాపారులకు సూచించారు. వార్డు పరిధి తాటిచెట్లపాలెంలోని వ్యాపారులకు బుధవారం ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వినియోగించడం వల్ల చాలా వ్యాధులు సంభవించే అవకాశం ఉందని, అందువల్ల గుడ్డ సంచులను మాత్రమే వాడాలని చెప్పారు. లేకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫాతిమ జెబా ఆలీ, రమణారెడ్డి, నానాజీ, శివ, మూర్తి, షేక్ అలిమబీబీ, శానిటేషన్ సూపర్‌వైజర్లు, సచివాలయం సెక్రటరీలు, పాల్గొన్నారు.

మురళీనగర్‌లో సందడిగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

మురళీనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి); మురళీనగర్ ప్రభుత్వ పిల్లల, మహిళల లైబ్రరీలో చేపట్టిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. బాలలకు నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో గౌరీ డిగ్రీ కాలేజీ లెక్చరర్ కృష్ణవేణి, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రమీల, జీవీఎంసీ స్కూల్ టీచర్ ఎం.వసంత తదితరులు బాలలకు బహుమతులు అందించారు. గ్రంథాలయంలో పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. లైబ్రేరియన్ పద్మజ, విద్యార్థులు హాజరయ్యారు. ఈ నెల 14న ఆరంభమైన గ్రంథాలయ వారోత్సవాలు ఇక్కడి మురళీనగర్ శాఖా గ్రంథాలయంలో సందడిగా నిర్వహించారు.

సంక్షిప్తంగా..

బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్‌కు ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తుతో పాటు రెండు ఫొటోలు, విద్యా, కుల, ఆదాయ, ఆధార్ ధ్రువ పత్రాలను జత చేయాలని తెలిపారు. దరఖాస్తులను బీసీ స్టడీ సర్కిల్, సెక్టర్ 6, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నం వద్ద నేరుగా అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ 9492569177లో సంప్రదించాలనిపేర్కొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ జోన్-3 (ఆపరేషన్స్) ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరానగర్ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా చెట్ల నరికివేత, లైన్ మరమ్మతులు చేపడుతుండడంతో సరఫరా నిలిపి వేస్తున్నట్టు వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఇందిరానగర్, ఆదర్శనగర్,రాజీవ్‌నగర్, సుందరనగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏయూలో అమెరికా అల్లుడు హాస్య నాటిక ప్రదర్శన నేడు

వెంకోజీపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కేవీ గోపాలస్వామి ఆరుబయలు రంగస్థలంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం రంగస్థల విభాగం ఆధ్వర్యంలో 'అమెరికా అల్లుడు' హాస్యనాటిక ప్రదర్శిస్తున్నట్టు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ఓపెన్ ఎయిర్ థియేటర్లో ప్రదర్శించే ఈ నాటికను నగరవాసులందరూ హాజరై తిలకించాలని తెలిపారు. కార్యక్రమంలో ముందుగా కె.చంద్రరావు వేణుగానం, ఎంవీ సుబ్రహ్మణ్య హాస్యవల్లరి నిర్వహిస్తారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి విశాఖ డెయిరీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వేతన సవరణ, కనీస వేతనాలు అమలు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశాఖ డెయిరీ కార్మికులు గురువారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. గత 20 ఏళ్లుగా కార్మిక సంఘం లేని విశాఖ డెయిరీలో సీఐటీయూ ఆధ్వర్యంలో గత నెల ఏర్పడిన విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో తమ హక్కుల సాధన కోసం కార్మికులు దీక్షలకు దిగుతున్నారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 30, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 20, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 30, క్యారెట్ 60 దొండకాయలు 34, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోస కాయలు 25, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 55, పొటల్స్ 52, కీర దోస 26, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 75, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

ఆకతాయిలకు ఆవాసంగా శ్మశానం

- గంజాయి సేవించేందుకు అడ్డాగా మార్చుకొని ఆకతాయిచేష్టలు
- బోరువెల్, లైట్లు ధ్వంసం
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు, పోలీసులు



తుప్పలతో నిండిన శ్మశానంలో గంజాయి సేవిస్తున్న ఆకతాయిలు

వెంకోజీపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆకతాయిలు చిల్లర చేష్టలకు పాల్పడేందుకు ఏ ప్రాంతాలనూ వదలడం లేదు. చివరకు శ్మశానాన్ని సైతం వాడేస్తున్నారు. వీరిని అడ్డుకట్ట వేసే వారే లేకుండా పోవడంతో వీరి ఆగడాలకు అంతే లేకుండా పోతోంది. జీవీఎంసీ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెంలో స్మశాన వాటికలో ఈ పరిస్థితి నెలకొని ఉంది. పనిపాటా లేని కొందరు సోంబేరీలు సమయాలతో సంబంధం లేకుండా శ్మశానంలో గంజాయి పీల్చుతూ వీరంగం ప్రదర్శిస్తున్నారు.

పూర్వం నుంచి శ్రీసీతారామ సేవా సంఘం, గ్రామ సేవా సంఘం సభ్యులు ఈ శ్మశానాన్ని వినియోగిస్తూ వస్తున్నారు. ఆనాటి నుంచి వాడుకల్లో ఉన్నా ఈ శ్మశానం కనీస సదుపాయాలకు నోచుకోవడం లేదు. ఏవో కారణాలు చూపి కొందరు అడ్డంకులు సృష్టిస్తుండడమే ఇందుకు కారణం. అయితే ఈ రెండు సంఘాల చొరవతో శ్మశానంలో నాలుగేళ్ల క్రితం రెండు దహన షెడ్లు, శివుడి విగ్రహం నిర్మాణం చేపట్టారు. అయితే నిర్మానుష్యంగా ఉంటే శ్మశానం తమకు అనువైనదిగా భావించారో ఏమో ఆకతాయిలు తమ అడ్డాగా మార్చుకున్నారు. సాధారణంగా చీకటి పడితే శ్మశానానికి వెళ్లేందుకు ఎవరైనా వెనుకడుగు వేస్తారు. శాస్త్రం కూడా అదే చెబుతోంది. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు మాత్రమే శ్మశానంలో దహన సంస్కారాలు, మానవుల సంచారం చేయాలి. కానీ మత్తులో మునిగి తేలడమే పనిగా పెట్టుకున్న ఆకతాయిలు రాత్రి వేళల్లో కూడా శ్మశానాన్ని వదలడం లేదు. షెడ్లను ఆవాసంగా చేసుకొని యథేచ్ఛగా గంజాయి పీల్చుతూ ఆకతాయి చేష్టలకు పాల్పడుతుంటారు. తుప్పలు దట్టంగా పెరగడం వీరికి కలిసి వస్తోంది. మత్తులో అక్కడ ఉన్న షెడ్ల రేకులను ధ్వంసం చేయడం, బోరువెల్‌ను విరగ్గొట్టడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా శ్మశానం బయట రోడ్డుపై ఉన్న విద్యుత్ దీపాలను ఎప్పటికప్పుడు పగులగొడుతుంటారు. ఆ ప్రాంతంలో వెలుతురు లేకుండా చేయడం వల్ల తమకు అనుకూలంగా చేసుకోవాలని అలా చేస్తుంటారు. దీంతో పాటు చీకటి పడితే చాలు కొత్త వెంకోజీపాలెం బస్టాప్ నుంచి పాత వెంకోజీపాలెంలోకి వచ్చే మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడం, చైన్‌స్నాచింగ్‌కు పాల్పడడం చేస్తున్నారు. వీరిని ఆగడాలను అరికట్టే చర్యలేవీ లేకపోవడంతో మరింతగా రెచ్చిపోతున్నారు. ఎవరైనా హితవు చెప్పేందుకు యత్నించినా అటువంటి వారిపై దాడులకు సైతం పాల్పడుతున్న సందర్భాలు ఉంటున్నాయి. పోలీసులు ఈ ప్రాంతంపై నిఘా పెంచి ఆకతాయిలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జీవీఎంసీ సహకరించడమే లేదు



శ్మశానంలో ఏ సౌకర్యాలు సొంతంగా ఏర్పాటు చేసుకుందామన్నా జీవీఎంసీ అధికారులు సహకరించడం లేదు. ఏవో అనుమతులు, కోర్టులో వ్యాజ్యం ఉందంటూ చెబుతున్నారు. గతంలో ఎందరో జీవీఎంసీ కమిషనర్లు ఈ ప్రాంతాన్ని పర్యటించి నప్పుడు మా సమస్యను వివరించాం. ప్రజా సమస్యలను పట్టించుకోకుంటే ఎలా? ఇదేం విధానం? తుప్పలు, చెట్లు పెరిగిపోవడంతో ఆకతాయిలకు అనువుగా మారింది. ఇప్పటికైనా జీవీఎంసీ, పోలీసులు స్పందించాల్సిన అవసరం ఉంది?

- పీల కనకరాజు, అధ్యక్షుడు, గ్రామ సేవా సంఘం

ఆకతాయిలను అరికట్టాలి



సాధారణ ప్రాంతంలోనే కాకుండా శ్మశానాన్ని సైతం ఆకతాయిలు వదలడం లేదు. జీవీఎంసీ ఈ శ్మశానంలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. స్థానిక సంఘాలు ఏవో సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నా, ఆకతాయిల దెబ్బకు అవి ధ్వంసం అవుతున్నాయి. ఈ విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇదిలా కొనసాగాల్సిందేనా..! ఇప్పటికైనా స్పందించాలి. అప్పుడే ఇబ్బందులు తొలగుతాయి.

- ఆదారి పరదేశినాయుడు, అధ్యక్షులు, శ్రీ సీతారామసేవా సంఘం

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

మద్దిలపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న 57వ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాలలో గ్రంథాలయ పితమహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ కామర్స్ విభాగం ప్రొఫెసర్ బి.మోహనవెంకటరామ్ మాట్లాడుతూ పుస్తక పఠనం గొప్పతనాన్ని వివరించారు. ప్రతీ పుస్తకం కొత్త విషయాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వెళ్లడం అలవర్చుకోవాలన్నారు. గ్రంథాలయమే ఓ విజ్ఞాన బాండాగారమన్నారు. వ్యక్తిత్వ వికాసానికి పుస్తకాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు కె.రవిబాబు, శ్రావణ్‌కుమార్, రాజేశ్వరరావు, పోల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని నగర శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభను బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి విచ్చేశారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రత్యేక అతిథులుగా వైశ్యరాజు జ్యుయలర్స్ అధినేత నరేష్‌రాజు, కేబీఆర్ ఈవెంట్స్ అధినేత కె.బాబూరావు, గ్రంథాలయాధికారి కేవీవీ ఉమామహేశ్వరరావు, సామాజిక కార్యకర్త సత్యకుమార్, రచయిత సునర్ల సర్వేశ్వర శాస్త్రి పాల్గొన్నారు.



ముగింపు వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు, వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులు

16వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలను సేకరిస్తున్న నారు గోపి, వాసు, మొల్లి శోభ తదితరులు

వెంకోజీపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డు కృష్ణా కళాశాల రోడ్డులో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు నారు గోపి, సీనియర్ నాయకులు ముగడ వాసుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ఈసారి సభ్యత్వాల సంఖ్యను మరింత పెరిగేలా చూడాలని నేతలు, కార్యకర్తలకు సూచించారు. కూటమి పాలన పట్ల ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారన్నారు. సభ్యత్వం తీసుకునే వారికి బీమా సదుపాయం ఉంటుందన్నారు. అనంతరం పలువురి నుంచి సభ్యత్వాలను స్వీకరించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొల్లి శోభ, మొల్లి శంకర్, జి.అప్పన్న, పల్లా ఉమారాణి, ఆర్.నూకరాజు, బి.బంగార్రాజు, ఎం.వాసు, ఆర్.భరత్‌కుమార్, కె.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్న రంగంలో ప్రోత్సహిస్తే సత్ఫలితాలు

- సీపీ శంఖబ్రత బాగ్చి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థికి ఆసక్తి ఉన్న రంగంలో ప్రోత్సాహం, శిక్షణ అందిస్తే ఆ విద్యార్థి ఉన్నత స్థానాలకు చేరే అవకాశం మెండుగా ఉంటుందని నగర పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చి పేర్కొన్నారు. బుధవారం దీనదయాళ్‌పురంలో గల ప్రభుత్వ బాలురగృహంలో నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న విషయంలో అభ్యసనం సాగిస్తే సులభంగా విషయం అర్థమవుతుందని, ఇది ఉన్నతం గా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. ఇక్కడ ఉన్న వారిలో ఐఏఎస్, ఐపీఎస్‌లు రావాలన్నారు. అలాజరిగితే ఎంతో సంతోషిస్తానన్నారు. ప్రతి విద్యార్థి రాత, చదవడం, అవగాహన చేసుకోవడంలో సమానమైన ప్రతిభ కలిగి ఉండాలన్నారు. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సబ్జెక్టులోని అంశాలను క్షుణ్ణంగా గుర్తుంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై దృష్టి సారించి బోధన చేయాలన్నారు. కేవలం విద్యా బోధనే కాకుండా విద్యార్థి మానసిక స్థితి, ఆరోగ్యం వంటి విషయాలను ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానంటూ ఆయన సెల్ నం.7995095799 ఇచ్చారు.

అనంతరం.. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమణ. ఈశ్వరీ ప్రజాహిత అక్క రామేశ్వరీ, ఐసీఐసీఐ బ్యాంకు విశ్రాంతి చీఫ్ మేనేజర్ మణిమాల, ఏపీ చైల్డ్ ప్రొటెక్షన్ సభ్యుడు గొండు సీతారాం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.రామలక్ష్మి, రాధ, సభ్యులు సూర్యనారాయణ, మందా రజనీ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల దినోత్సవం

అలాగే దీనదయాళ్‌పురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో బాలల హక్కుల వారోత్సవాలు ముగింపు సమావేశానికి సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యారులు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.

వాతావరణ మార్పులపై జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ

- మేయర్ హరి వెంకటకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటరమణ

వెంకోజీపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా నగరాల్లో గణనీయంగా వాతావరణం మార్పులు సంభిస్తున్నాయని, ఇది ప్రజాజీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతోందని విశాఖ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ఇది నగరాలకు సవాలుగా మారిందని, ఈ నేపథ్యంలో విశాఖ నగర వాతావరణం మార్పుపై జీవీ ఎంసీ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందన్నారు. బుధవారం ఆమె జీవీఎంసీ అధ్వర్యంలో ఐసీఎల్ఈఐ ఆర్గనైజేషన్ క్లైమెట్ యాక్షన్‌పై రెసిలియన్స్ సిటీస్ ప్లానింగ్, ఆచరణ కోసం ఆంధ్రప్రదేశ్‌లో 3 నగరాలైన విశాఖ, విజయవాడ, కాకినాడ ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌నకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వాతావరణ మార్పు కారణంగా గ్లోబల్ టెంపరేచర్స్ పెరుగుతుండడంతో సముద్ర మట్టం పెరగడం, తీవ్ర వాతావరణ సంఘటనలు, వరదలు, కరువు, తుఫాన్లు, వాయు కాలుష్యం వంటి ప్రభావాలను పెంచుతుందన్నారు. ఇప్పటికే భారతదేశంలో గల నగరాలు వరదలు, తుపానులు, తీవ్రమైన శీతాకాలాలు, వేడి తరంగాలకు గురవుతున్నాయని, వీటి తీవ్రత పెరుగుతూ రావడం ఆందోళన కలిగిస్తుందన్నారు. విశాఖపట్నం ఒక తీరప్రాంత పరిశ్రమ నగరంగా పలు ప్రమాదాలు, విపత్తులకు గురవుతోందన్నారు. పరిస్థితులు క్లైమేట్ చేంజ్ ప్రభావాల వలన మరింత తీవ్రంగా మారుతున్నాయని ప్రజల రక్షణ దిశగా విశాఖ నగర క్లైమేట్ చేంజ్‌ను ఎదుర్కొనడానికి ప్రభుత్వం పలు అనుసరణ, నిరోధక చర్యలను తీసుకుంటుందన్నారు.

విశాఖ నగరం ఇప్పటికే పునరుత్పాదక శక్తి వనరుల వినియోగంలో ముందంజలో ఉందని, జీవీఎంసీ 13 మెగావాట్ల సోలార్ శక్తి గరిష్ఠ సామర్థ్యం కలిగిన ప్లాంట్లను నీటిపై, భూమిపై, రూఫ్‌టాప్‌లపై ఏర్పాటు చేసి గ్రీన్ ఎనర్జీ ద్వారా నగరానికి కావాల్సిన అవసరాలను సమకూర్చుకుంటోందన్నారు.

జీవీఎంసీ బీచ్ రోడ్డులో 3000 సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేసిందన్నారు. విశాఖలో 28శాతం గ్రీన్ కవర్ ఉందని మరింత పచ్చదనం ప్రజల సహకారంతో పెంపొందించేందుకు చర్యలు జీవీఎంసీ చేపడుతుందన్నారు. నగరంలో కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ బీచ్‌రోడ్డులో ప్రజా రవాణా కోసం ఉచితంగా ఈ ఆటోలు ప్రవేశపెట్టి, అలాగే ఇంటింటి నుంచి చెత్త సేకరణ కోసం 65 ఈ ఆటోలను వినియోగిస్తున్నామన్నారు. వీటితో పాటు విశాఖ నగరంలో చేపడుతున్న పలు కార్యక్రమాలను మేయర్ వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏయూ గ్రంథాలయంలో ఇన్ఫ్లిబినెట్ సేవలు



ఇన్ఫ్లిబినెట్ శాస్త్రవేత్త అభిషేక్ కుమార్‌ను అభినందిస్తున్న వీసీ

వెంకోజీపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏయూలో ఇన్ఫ్లిబినెట్ సేవలను పూర్తిస్థాయిలో విద్యార్థులకు, పరిశోధనలకు అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా ఏయూ అధికారులు ముందడుగు వేశారు. బుధవారం ఏయూకు విచ్చేసిన ఇన్ఫ్లిబినెట్ శాస్త్రవేత్త అభిషేక్‌కుమార్ ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావులతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇన్ఫ్లిబినెట్ అందిస్తున్న సేవలను వివరించారు. త్వరలో ఇన్ఫ్లిబినెట్‌తో అవగాహన ఒప్పందం చేసుకోవాలని ఏయూ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. దీనికి అవసరమైన చర్యలు, వేగవంతం చేయాలని గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లును సూచించారు.

బతుకు తెరువు చూపుతాడనుకుంటే..

చేతిలో బొచ్చె పెట్టాడు

- 22వ కార్పొరేటర్ మూర్తియాదవ్‌పై వీధి వ్యాపారుల ఆవేదన
- భిక్షాటన చేసి నిరసన



ధర్నా నిర్వహిస్తున్న 22వ వార్డు వీధి వ్యాపారులు

సిరిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా నష్టపోయానని, ఇదే తనకు చివరి అవకాశమని కాళ్లుచేతులు పట్టుకుని బతిమాలితే పీతల మూర్తి యాదవ్‌కు ఓటేశామని, ఆయన గెలుపునకు తమ వంతు కృషి చేశామని 22వ వార్డుకు చెందిన వీధి వ్యాపారులు పేర్కొన్నారు. తీరా గెలిచిన తర్వాత ఆయన తమకు బొచ్చె చేతిలో పెట్టి, బతుకులు దుర్భరం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదులో దుకాణాలు కోల్పోయిన వీధి వ్యాపారులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరు వ్యాపారుల పొట్టకొట్టిన పీతల మూర్తియాదవ్‌ను బర్తరఫ్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మూర్తియాదవ్ పెద్ద అక్రమార్కుడని ధ్వజమెత్తారు. వార్డులో పేదల బతుకులు బజారుకీడ్చి వార్డు బయట ఉత్తముడిగా చలామణీ అవుతున్నాడని మండిపడ్డారు. న్యాయవాది శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ వార్డు ప్రజల ఓట్లతో గెలిచిన మూర్తి యాదవ్ రోడ్లు, వీధిలైట్లు, కాలువలు, పరిశుభ్రత వంటి సమస్యలను గాలికొదిలేసి.. పేదలు, వీధి వ్యాపారులను ఇబ్బంది పెట్టడం దుర్మార్గమన్నారు. 2014లో ప్రధాని మోదీ ప్రభుత్వం చిరు వ్యాపారుల కోసం స్ట్రీట్‌వెండర్స్ యాక్ట్ తీసుకొచ్చిందని తెలిపారు. వార్డులోని ఉన్నత వ్యాపారుల లబ్ధి కోసం సహకరించే మూర్తి యాదవ్ చిరు వ్యాపారులపై మాత్రం కక్ష కట్టడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో తోపుడు బండ్ల దుకాణదారులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి గూగుల్ ప్రత్యామ్నాయం కాదు

- ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

వెంకోజీపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలంటే కేవలం పుస్తకాలే కాదని, ఒక జ్ఞానకేంద్రంగా నిలుస్తాయని ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అన్నారు. బుధవారం ప్లాటినం జూబ్లీ సమావేశాల్లో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ గ్రంథాలయానికి గూగుల్ ప్రత్యామ్నాయం కాదని చెప్పారు. ఆన్‌లైన్‌లో చదవడం వల్ల కేవలం 30 శాతం సమాచారం మాత్రమే గ్రహించగలమని, పుస్తకాలు చదివితే 70 శాతం వరకు జ్ఞానాన్ని గ్రహించగలమన్నారు. పుస్తక పఠనం అత్యుత్తమైన విధానమని, విద్యార్థులు దీన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తాము విద్యార్థిగా ఏయూలో చదివే సమయంలో అత్యధిక సమయాన్ని గ్రంథాలయంలో గడిపే వారమని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం గ్రంథాలయంలో విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. శోధ్ గంగాలో ఏయూ గ్రంథాలయం ఆరవ స్థానంలో నిలవడంపై అభినందనలు తెలిపారు. ఇక్కడ ఉన్న పుస్తకాలు ఈ-జర్నల్స్ ఇతర వనరులను సద్వినియోగం చేసుకోవాలని, పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గత వారం రోజులుగా నిర్వహించిన కార్యక్రమ వివరాలను ఆచార్య వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఇన్ఫ్లిబినెట్ శాస్త్రవేత్త అభిషేక్ కుమార్ వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయ వారోత్సవాల సమదస్సులోపాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

రోడ్డుకు అడ్డంగా చెట్టు

- కూలిపోయి మూడు రోజులైనా తొలగించని జీవీఎంసీ సిబ్బంది
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు



రోడ్డును ఆక్రమించి పడి ఉన్న చెట్టు

ఆరిలోవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల సూర్యతేజనగర్ బ్రిడ్జి సమీపంలో ఒక చెట్టు విరిగి రోడ్డునకు అడ్డంగా పడి ఉంది. దీనివల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడమే కాకుండా ప్రమాదాలు సంభవించే పరిస్థితి ఉంది. ఈ చెట్టు విరిగి సుమారు మూడురోజులు అవుతున్నా తొలగింపునకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో బిజీ సమయంలో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. రాత్రి సమయంలో ప్రమాదాలు సంభవించే పరిస్థితి నెలకొందని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ విరిగి పడి ఉన్న చెట్టు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

మసీదు రోడ్డులో అర్ధరాత్రి హంగామా!

పోలీసుల అండతో యథేచ్ఛగా వ్యాపారాలు



జగదాంబ జంక్షన్ వద్ద అర్ధరాత్రి ఆహారం విక్రయం

జగదాంబ కూడలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగదాంబ జంక్షన్ మసీదు ఏరియా ఫుడ్ స్టాల్స్ వద్ద అర్ధరాత్రి వరకు యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. నగర పరిధిలో ఎక్కడా లేని విధంగా సెకండ్ షో సినిమా తర్వాత వచ్చి నచ్చిన ఆహారం ఇక్కడ ఆరగించవచ్చు. పోలీసు జీపులు ఎన్నిసార్లు రయ్..రయ్ మంటూ తిరిగినా, ఇటువైపు చూసినా చూడనట్టే నటిస్తుంటారు. గత కొన్నేళ్లుగా పోలీసుల అండదండలతోనే ఇక్కడ అర్ధరాత్రి దాటే వరకు తోపుడు బళ్ల వద్ద కీమా, ఎగ్ దోశల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని స్థానిక నివాసితులు ఆరోపిస్తున్నారు. మసీదు ఏరియాలో మాంసాహారం, ఫాస్ట్‌ఫుడ్ స్టాల్స్ విపరీతంగా పెరిగిపోయాయి. రాత్రి 11 గంటల వరకు మాత్రమే విక్రయాలకు అనుమతి ఉన్నా... ఇక్కడ మాత్రం మినహా యింపు ఇచ్చేలా ఉంది పరిస్థితి. అర్ధరాత్రి దాటినా నచ్చిన ఆహారం దొరుకుతుండడంతో మసీదు రోడ్డు మందుబాబులకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. యువత ఈ స్టాల్స్ వద్ద గ్రూపులుగా మద్యం సేవిస్తున్నారు. దుకాణాలు మూసిన తర్వాత కొంత మంది మద్యం సీసాలతో ఇక్కడ ప్రత్యక్షమవుతున్నారని కొంత మంది వ్యాపారుల ఆరోపణ. మామూళ్లు, ఆహారం రుచి మరిగిన పోలీసులు ఇక్కడి వ్యాపారులను పల్లెత్తు మాట అనడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సమీప ప్రాంతాల్లో పాన్, టిఫిన్ దుకాణాలు తెరచి ఉంటే పోలీసులు ఆగమేఘాలపై వచ్చి మూయిస్తారు. మసీదు ప్రాంతంలోని దుకాణాల వద్దకు జీపుల్లో బందోబస్తు పోలీసులు వచ్చినా చర్యలు తీసుకోకపోవ డమేమిటని స్థానిక నివాసితులు ప్రశ్నిస్తున్నారు. దీనికి పోలీసులే సమాధానం చెప్పాల్సి ఉంది.

స్కూల్ గేమ్స్ జాతీయ కరాటే టోర్నీకి జగన్ ఎంపిక



జగన్‌ను అభినందిస్తున్న సతీష్‌కుమార్

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన ఎస్.జగన్ ఎంపికయ్యాడు. కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నీలో అండర్-19 కేటగిరీలో అద్భుతంగా రాణించి స్వర్ణ పతకాలు సాధించి డిసెంబరు 27 నుంచి భోపాల్‌లో జరిగే జాతీయ కరాటే పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా వాడో కై కరాటే డో అసోసియేషన్ అధ్యక్షుడు చిగురుపల్లి సతీష్‌కుమార్ బుధవారం తన కార్యాలయంలో జగన్‌ను అభినందించి జాతీయ టోర్నీలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించారు. కోచ్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీగా బమ్మిడి శ్రీనివాసరావు

మహారాణిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిటీ స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసుగా నియమితులైన బమ్మిడి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. 2012 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరావు నగర పోలీసు శాఖలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహించి అధికారుల మన్నన పొందారు.

ఉపవిద్యాశాఖాధికారికి సత్కారం



సోమేశ్వర్రావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కంచరపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ డీఈవోగా బాధ్యతలు చేపట్టిన అంబటి సోమేశ్వర్రావును జ్యోతినగర్ ఎంఈవో కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయులు అభినందించారు. గోపాలపట్టణం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై వీఎస్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో కాంప్లెక్స్ పరిధిలోని ఆరు ఉన్నత పాఠశాలలు, 11 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని సోమేశ్వర్రావును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వేణుగోపాల్ మాట్లాడుతూ డిప్యూటీ డీఈవోగా తనదైన ముద్ర వేసి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. మండలంలోని ఉపాధ్యాయులంతా పూర్తి స్థాయిలో సహకరిస్తామన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి: జేసీ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

జగదాంబ కూడలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయం వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు, మొబైల్‌తో కాలం వృథా చేయవద్దని హితవు పలికారు. పుస్తకాలు చదవడం వల్ల భవిష్యత్‌లో ఎన్నో విజయాలకు చేరువవుతారన్నారు. గ్రంథాలయాలు మనోవికాసానికి పట్టుకొమ్మలన్నారు. సాంకేతిక మార్పులు వచ్చినా, పుస్తక పఠనంతో ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, పాటల పోటీల్లో విజేతలు 42 మందికి జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్ వెంకటరావు, డివిజనల్ పీఆర్వో నారాయణరావు, ఎంఈవో పైడపునాయుడు, వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

గండి బాబ్జీ, పీవీజీ కుమార్‌లకు సత్కారం



టీడీపీ నేతలను సన్మానిస్తున్న బీసీ సంఘ నాయకులు

అక్కయ్యపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమితులైన గండి బాబ్జీ, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్‌గా నియమితులైన పీవీజీ కుమార్‌లను ఉత్తరాంధ్ర బీసీ సంఘం నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. మెట్రో పాలిటన్ విశ్రాంత మేజిస్ట్రేట్ పైలా సన్నిబాబు, నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, వైజాగ్ పటం క్లబ్, వాకర్స్ క్లబ్ సభ్యులు వారికి గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గొంప సత్యనారాయణ, వాసు, చిట్టిబాబు, సీనియర్ నాయకులు పంకజ్, బాపినాయుడు, విజయ్, కొండలరావు, మహేష్, ఈశ్వరరావు, గంటా అప్పలనాయుడు పాల్గొన్నారు.

'విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి'

సీతమ్మధార, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) విశాఖ జిల్లా కమిటీ ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కి వినతిపత్రం సమర్పించింది. కాంట్రాక్ట్ కార్మికులు రాత్రింబవళ్లు అతి తక్కువ జీతాలతో పనిచేస్తున్నారని, అయిదేళ్లుగా పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని పేర్కొన్నారు. జెన్కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని, సమాన వేతనం ఇవ్వాలని, 2022 పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, పనిచేస్తున్న కార్మికులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. యూనియన్ అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి కుమార్, అధ్యక్షులు కె.సత్యారావు, సెక్షన్ ఆపరేటర్స్ పరశురాం, మోహన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 33 మంది బాల కార్మికుల గుర్తింపు

డాబాగార్డెన్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కలెక్టర్ ఆదేశం మేరకు నెల రోజులు బాల కార్మికుల గుర్తింపు డ్రైవ్ చేపట్టామని ఉప కార్మిక కమిషనర్ తెలిపారు. నవంబరు 20 వరకు జిల్లా పరిధిలో 33 మంది బాల కార్మికులను గుర్తించామన్నారు. కేసులు నమోదు చేసి, యాజమాన్యాలు నుంచి రూ.1,26,325 జరిమానా వసూలు చేశామన్నారు. బాల కార్మికుల చట్టం కింద ఐదు దుకాణాలను గుర్తించి డిమాండ్ నోటీస్‌లు జారీ చేసి రూ.20 వేలు వంతున జరిమానా వసూలు చేసినట్టు పేర్కొన్నారు. బాల కార్మికుల చట్టం కింద 3 దుకాణాలపై రెండో అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు విశాఖపట్నం వద్ద 3 కేసులను ఫైల్ చేసినట్టు అధికారి పేర్కొన్నారు.

సంప్రదాయబద్ధంగా సంక్షిప్త రామాయణ హవనం



హవనం చేస్తున్న రుత్విక్‌లు

సింహాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై సీతారామస్వామి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతినెలలో వచ్చే శ్రీరాముడి జన్మ నక్షత్రం పునర్వసు పురస్కరించుకుని సంక్షిప్త రామాయణ హవనం నిర్వహించడం ఆనయివాతీ. ఈమేరకు వేకువజామున సుప్రభాతసేవలు తరువాత ఉత్సవమూర్తులు సీతారాములతో పాటు లక్ష్మ, ఆంజ నేయులను పుష్పమాలికలతో అలంకరించిన ప్రత్యేక వేదికపై ఉంచారు. లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో శ్రీకారం చుట్టి హవనాన్ని జరిపారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

'ప్రజల హృదయాలే మంచి కథకు వేదిక'



సమావేశంలో మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్, వేదికపై డి.వి.సూర్యారావు, కె.జి. వేణు, దామరాజు విశాలాక్షి తదితరులు

సీతంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కథానికలు వాస్తవ జీవన సత్యాలు.. మంచి కథ ప్రజల హృదయాలలో కలకాలం నిలుస్తుందని సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో గ్రంథాలయ సొసైటీ, సహృదయ సాహితి సౌజన్యంతో బుధవారం నిర్వహించిన కథారచయితల గోష్ఠి ప్రేక్షకులను అలరించింది. విశ్లేషకులు డాక్టర్ డి.వి.సూర్యారావు, డాక్టర్ కె.జి. వేణు, ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, గన్నవరపు నరసింహమూర్తి, ఇందూరమణ, మల్లాప్రగడ రామారావు, దామరాజు విశాలాక్షిలు కథా రచయితల గోష్ఠి, కథానిక తదితర విశేషాలను విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో భాగవతుల సత్యనారాయణ మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు, డాక్టర్ కె.వి.ఎస్. మూర్తి, కొత్తూరు రమణ, ఉప్పల అప్పలరాజు, డాక్టర్ సిహెచ్ నిర్మలాదేవి, పరవస్తు ఫణీశయన సూరి పాల్గొన్నారు..

అత్యాచార నిందితులపై కఠిన చర్యకు డిమాండ్



నిరసన నినాదాలు చేస్తున్న మహిళా ప్రతినిధులు

అల్లిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖలో న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వంశీ, జగదీష్, ఆనంద్, రాజేష్‌లను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. బుధవారం అల్లిపురంలోని చలువతోట వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కె.వనజాక్షి, ఎండీ బేగంలు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు మళ్లీ జరగకుండా వంశీ, అతని స్నేహితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షురాలు ఎ.దేముడమ్మ, సభ్యులు బి.పుష్పలత, సీహెచ్ నూకాలమ్మ, భాను, కొండమ్మ, హేమలత, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

24న శెట్టిబలిజల వన సమారాధన



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సంఘాల ప్రతినిధులు

సీతంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజల ఐక్యతను చాటిచెప్పేలా కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాలతో ఈ నెల 24న కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు శెట్టిబలిజ సీనియర్ నాయకుడు కట్టా మల్లేశ్వరరావు తెలిపారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ పంపిన ప్రతినిధులు చొల్లంగి వెంకటరమణ, గుత్తుల విజయ్‌కుమార్, రాయుడు శ్రీనివాస్, కుడిపూడి శ్రీనివాస్, రెడ్డి భగవాన్, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యా, రెడ్డి వెంకటేశ్వరరావులతో కలిసి ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం వనసమారాధన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 24న అమలాపురంలో సత్తెమ్మ తల్లి గుడి వద్ద కార్తీక వనసమారాధనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కడలి సుబ్బారావు, ఇల్లా వెంకటేశ్వరరావు, గుత్తుల తులసి పార్వతి, దొమ్మేటి భీమన్న, మట్టపర్తి నాగరాజు, అప్పారి గిరిబాబు, మట్టపర్తి గోపాలరావు, చెల్లిబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కందుల నాగరాజు

అల్లిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని 32వ వార్డు కార్పొరేటర్, జనసేన నేత కందుల నాగరాజు అన్నారు. అల్లిపురం చలువతోట ప్రాంతంలో బుధవారం మత్స్యకారుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్యకారుల సంఘం సభ్యురాలు చెల్లూరు నూకాలమ్మ, నాగభూషణ్, నల్లయ్య, చెల్లూరు బుజ్జి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ రద్దు చేయాల్సిందే'



పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

అక్కయ్యపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులను బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ నాయకులు తెలిపారు. తాటిచెట్లపాలెంలో ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించి, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, వీవోఏ, ఆర్పీలు, జాతీయ ఆరోగ్య మిషన్, సమగ్ర శిక్షాలో పని చేస్తున్నవారిని ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాల సంఘటిత ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, అప్పలరాజు, గౌరీష్, రమణ, శివ, శ్యాంసాన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్ కుమార్

సింహాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే విద్యార్థులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని డీఈఓ ప్రేమ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో జరిగిన ఫిజికల్ సైన్స్ స్కూల్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సమాజ అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు అప్ డేట్ కావాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులను పలు పాఠ్యాంశాల్లో ప్రశ్నించి ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఆయనతో పాటు హెచ్‌ఎం ఇమంది పైడిరాజు ఉన్నారు.

ఎండాడ: గొల్లల ఎండాడ ప్రాథమిక పాఠశాలను డీఈఓ ప్రేమ్‌కుమార్ సంద ర్శించారు. ఈసందర్భంగా ఆయన తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధన తీరుతో పాటు విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. ఆయనతో పాటు ఎం ఈవోలు రవీంద్ర బాబు, అనురాధ ఉన్నారు.

మార్చి నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్ నంబరు మార్పు

విశాఖపట్నం, నవంబరు (ఆంధ్రజ్యోతి): విశాఖ-తిరుపతి/కడప మధ్య రాకపోకలు సాగించే తిరుమల ఎక్స్‌ప్రెస్‌తోపాటు మరికొన్ని రైళ్ల నంబర్లను మార్పు చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 17488 నంబరుతో విశాఖ నుంచి తిరుపతి/కడప వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్ వచ్చే ఏడాది మార్చి ఒకటి నుంచి 18521 నంబరుతో, తిరుగు ప్రయాణంలో 17487 నంబరుతో కడప/తిరుపతి నుంచి విశాఖ వచ్చే తిరుమల ఎక్స్‌ప్రెస్ మార్చి ఒకటి నుంచి 18522 నంబరుతో రాకపోకలు సాగిస్తాయి. అలాగే 18311 నంబరుతో నడిచే విశాఖ-బనారస్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ మార్చి 2 నుంచి 18523 నంబరుతో, తిరుగు ప్రయాణంలో 18312 నంబరుతో నడిచే బనారస్-విశాఖ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ మార్చి 3 నుంచి 18524 నంబరుతో నడుస్తాయి. ఇక 22701/22702 నంబర్లతో విశాఖ-గుంటూరు-విశాఖ మధ్య నడుస్తున్న ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మార్చి ఒకటి నుంచి 22875, 22976 నంబర్లతో, విశాఖ-కిరండోల్-విశాఖ మధ్య రాకపోకలు సాగిస్తున్న నైట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మార్చి ఒకటి నుంచి 18513, 18514 నంబర్లతో నడుస్తాయని పేర్కొన్నారు.

తీర్థయాత్రల రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

డిసెంబరు 22 తర్వాత బెర్తులు అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు విశాఖ-ఎల్‌టీటీ వయా సికింద్రాబాద్ (18519), కోణార్క్ (11020) ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మన్మాడ్ వరకు వెళ్లే అవకాశం ఉన్నా షిర్డీ భక్తులు ఆసక్తి చూపడం లేదు. కుటుంబ సమేతంగా షిర్డీ వెళ్లేవారికి వారానికి ఒక్కరోజు మాత్రమే అందుబాటులో ఉన్న షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503) అనుకూలంగా ఉన్న నేపథ్యంలో షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను బైవీక్లీగా నడపాలని డిమాండ్ కూడా చాలాకాలం నుంచి ఉంది. రైల్వే అధికారులు దృష్టి సారించి షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను బైవీక్లీగా మార్చాలని కోరుతున్నారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు నెలాఖరు వరకు ఫుల్

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 28 వరకు అన్ని తరగతుల బెర్తులు నిండిపోయాయి. డిసెంబరు 30, 31 తేదీల్లో ఫస్ట్ ఏసీలో కొన్ని బెర్తులు, జనవరిలో సంక్రాంతి పండుగ సమయంలో మూడు రోజులు కూడా ఏసీ బెర్తులు మాత్రమే లభిస్తున్నాయి. ప్రతి శనివారం భువనేశ్వర్‌లో బయలుదేరి విశాఖ మీదుగా తిరుపతి వెళ్లే భువనేశ్వర్-తిరుపతి (22879)లో జనవరి 18 వరకు, ప్రతి ఆదివారం విశాఖ మీదుగా భువనేశ్వర్ నుంచి తిరుపతి వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22871)కు జనవరి 5 వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు. విశాఖ మీదుగా ప్రతిరోజు నడిచే హౌరా-యశ్వంత్‌పూర్ (12863) ఎక్స్‌ప్రెస్‌తోపాటు ఖరగ్‌పూర్-విల్లుపురం (22603), వివేక్ ఎక్స్‌ప్రెస్ (22815), పురిలియా-విల్లుపురం (22605), పూరి-తిరుపతి (17479), బిలాస్‌పూర్-తిరుపతి (17481), హటియా-బెంగళూరు (18637), భువనేశ్వర్-బెంగళూరు (12845), హౌరా-తిరుపతి హంసఫర్ (20889), సంత్రాగచ్చి-తిరుపతి (22855) వంటి వారాంతపు, బైవీక్లీ రైళ్లకు డిమాండ్ నెలకొంది. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో విశాఖ నుంచి బయలుదేరే డబల్ డెక్కర్ (22707) ఎక్స్‌ప్రెస్‌లో మాత్రం సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఆర్కే బీచ్‌రోడ్డుకు అదనపు ఆకర్షణ

... 5వ పేజీ తరువాయి

పూర్తి చేసి పర్యాటకులకు కానుకగా ఇవ్వాలని భావిస్తున్నారు. ఈ హెలికాప్టర్‌ను ఐఎన్ఎస్ డేగాలోనే భాగాలుగా విడదీసి రెండు ట్రాలర్లలో బుధవారం ఆర్కే బీచ్‌రోడ్డుకు తీసుకువచ్చారు. వాటిని భారీ క్రేన్ సాయంతో కేటాయించిన స్థలంలో పెట్టారు. ముందు హెలికాప్టర్ భాగాలన్నీ కలిపి, రూపం తీసుకువచ్చాక, తరువాత చుట్టూ సివిల్ పనులు చేపట్టనున్నారు.

నిరుపేదలకు ఆరోగ్య రక్ష

... 5వ పేజీ తరువాయి

పరిధిలో ఉన్న ఆస్పత్రులన్నీ ఈ పథకానికీ సేవలందిస్తున్నాయి. ఎన్టీఆర్ వైద్య సేవ కార్డులు కలిగిన కుటుంబాలు జిల్లాలో 4.3 లక్షలు ఉండగా, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఇప్పటివరకు తొలివిడతలో 2,44,192 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు.

ఇదీ ఎంపిక ప్రక్రియ..

ఆయుష్మాన్ భారత్ పథకానికి బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువనున్న) కుటుంబానికిచెందిన వారంతా అర్హులే. ఇప్పటికే లబ్ధిదారుల జాబితాను కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు అందించింది. వీరికి కార్డులను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే బీపీఎల్ పరిధిలో లేకపోయినా 70 ఏళ్లు దాటిన వారంతా ఈ పథకానికి అర్హులుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అర్హుల జాబితా వచ్చిన తరువాత క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం సర్వే చేస్తారు. యాప్‌లో వివరాలను పొందుపరుస్తారు. అనంతరం వారికి కార్డులు పంపిణీ చేస్తారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదుచేయడం ద్వారా కార్డు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. అర్హులైనప్పటికీ ఈ పథకానికి ఎంపిక కాకపోతే స్థానిక గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందిని సంప్రతించాలి.

కార్డుల పంపిణీకి చర్యలు

జిల్లాకు ఇప్పటివరకు వచ్చిన ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నాం. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలోని అన్ని ఆస్పత్రుల్లో ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్యసేవలు అందిస్తారు. ఇబ్బందులుంటే స్థానిక ఆరోగ్య, సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలి. రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో భాగంగా రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం పొందే వీలుంది.

- డాక్టర్ అప్పారావు, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్

ఉక్కు ఉద్యోగులకు అందని వేతనాలు

... 5వ పేజీ తరువాయి

రికవరీ చేసిన మొత్తం త్రిఫ్ట్ సొసైటీకి జమ కావడం లేదు. రుణాల రికవరీ సక్రమంగా జరగకపోవడంతో ఉద్యోగులకు సొసైటీ రుణాలు మంజూరుచేయడం లేదు. దీంతో వారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. జీతాలు సక్రమంగా అందకపోవడంతో చాలామంది ఉద్యోగులు అప్పులు చేస్తున్నారు. ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పూర్తి జీతాలు చెల్లించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు'

అల్లిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం చూపవద్దని జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం జోనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్జీదారులతో మర్యాదపూర్వకంగా ఉంటూ, వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి ప్రయత్నించాలని సూచించారు. అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను తప్పక పాటించాలన్నారు. ఆర్ఓ రతన్‌రాజు, ఏపీడీ పద్మావతి, ఆర్ఐలు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

గాయకుల ప్రతిభకు ప్రోత్సాహం



సత్కారం పొందిన గాయనీమణులతో అతిథులు

అక్కయ్యపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గాయనీమణుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని సెంచూరియన్ విశ్వవిద్యాలయం చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు అన్నారు. ఘంటసాల స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ బుధవారం సాయంత్రం అక్కయ్యపాలెం స్వరాలయ స్టూడియోలో గాయనీ మణులు కోమలీ ప్రసాద్, మాధురి, సుజాతలతో 'వేణు గానమ్ము వినిపించెనే' శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ శ్రావ్యమైన గీతాలతో అలరించిన గాయకులను ప్రశంసించారు. అనంతరం గాయకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ సుహాసిని ఆనంద్, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, జి.త్యాగరాజన్, పి.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే వ్యాపారులకు జరిమానా

అక్కయ్యపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లను మానేసి గుడ్డ సంచులను వినియోగించాలని 45వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ వ్యాపారులకు సూచించారు. వార్డు పరిధి తాటిచెట్లపాలెంలోని వ్యాపారులకు బుధవారం ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వినియోగించడం వల్ల చాలా వ్యాధులు సంభవించే అవకాశం ఉందని, అందువల్ల గుడ్డ సంచులను మాత్రమే వాడాలని చెప్పారు. లేకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫాతిమ జెబా ఆలీ, రమణారెడ్డి, నానాజీ, శివ, మూర్తి, షేక్ అలిమ బీబీ, శానిటేషన్ సూపర్‌వైజర్లు, సచివాలయం సెక్రటరీలు, పాల్గొన్నారు.

మురళీనగర్‌లో సందడిగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

మురళీనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి); మురళీనగర్ ప్రభుత్వ పిల్లల, మహిళల లైబ్రరీలో చేపట్టిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. బాలలకు నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో గౌరీ డిగ్రీ కాలేజీ లెక్చరర్ కృష్ణవేణి, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రమీల, జీవీఎంసీ స్కూల్ టీచర్ ఎం.వసంత తదితరులు బాలలకు బహుమతులు అందించారు. గ్రంథాలయంలో పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. లైబ్రేరియన్ పద్మజ, విద్యార్థులు హాజరయ్యారు. ఈ నెల 14న ఆరంభమైన గ్రంథాలయ వారోత్సవాలు ఇక్కడి మురళీనగర్ శాఖా గ్రంథాలయంలో సందడిగా నిర్వహించారు.

స్టీల్‌ప్లాంటులో స్తబ్దుగా కార్మిక సంఘాలు!

- నాటి పోరాటాలకు భిన్నంగా నేటి పరిస్థితులు
- ప్రధాన సంఘాలు మినహా మిగతావన్నీ నోరువిప్పని వైనం
- ఉక్కు యాజమాన్యం హెచ్చరికలే కారణమంటున్న కార్మికులు



ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ అంటే ఠక్కున గుర్తుకొచ్చేది పోరాటాలే. ఎన్నో పోరాటాలు.. 32 మంది ప్రాణ త్యాగాల ఫలితంగా ఏర్పడిందే విశాఖ ఉక్కు కర్మాగారం. అటువంటి స్టీల్ ప్లాంటును కాపాడుకునేందుకు, కార్మిక హక్కుల పరిరక్షణకు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకునేందుకు పోరాటాలే శరణ్యంగా భావించి ఆ దిశగా పోరాటాలు సాగించారు. అటువంటి స్టీల్‌ప్లాంటులో ప్రస్తుతం అనేక కార్మిక సంఘాలు స్తబ్దుగా ఉన్నాయి. తొలుత ఉక్కు కర్మాగారంలో కేవలం మూడు కార్మిక సంఘాలు మాత్రమే ఉండగా, కాలక్రమంలో 32 కార్మిక సంఘాలు ఏర్పడ్డాయి. దేశంలో, రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీలకు అనుబంధంగా కార్మిక సంఘాలు స్టీల్‌ప్లాంటులో నెలకొన్నాయి.

ఈ 32 కార్మిక సంఘాలు ప్లాంటులో ఎవరికి వారుగా లేదా కొన్ని కార్మిక సంఘాలతో కలిసి పోరాటాలు చేసేవారు. దేశంలో ఎక్కడ అనుకోని సంఘటన జరిగినా, లేదా దేశవ్యాప్త పోరాటాలకు పిలుపునిచ్చినా ఆ ప్రభావం స్టీల్‌ప్లాంట్‌లో కనిపించేలా ధర్నాలు, ఆందోళనలు చేసేవారు. అయితే ప్లాంట్ గుర్తింపు యూనియన్ ఎన్నికలప్పుడు మాత్రం కొన్ని కార్మిక సంఘాలు ఒక్కటై పోటీ చేసేవి. ఎన్నికల తరువాత మళ్లీ ఏ యూనియన్ పోరాటం ఆ యూనియన్‌దేగా మారేది. అయితే నాటి పోరాటాలకు భిన్నంగా నేటి పరిస్థితులు మారాయి.

ప్లాంటులో ఉన్న 32 కార్మిక సంఘాల్లో ఇప్పుడు కేవలం కొన్ని ప్రధాన సంఘాలు మాత్రమే పోరాటాలు చేస్తున్నాయి. మిగతా సంఘాలన్నీ పోరాటాలకు దూరంగా ఉన్నాయి. ప్రధాన సంఘాలు కూడా తూతూ మంత్రంగానే పోరాటాలు చేస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కర్మాగారంలో గానీ బయట కానీ ధర్నాలు, ఆందోళనలు చేస్తే ఉక్కు యాజమాన్యం సంబంధిత ఉద్యోగికి మెమో ఇస్తుండడం, హెచ్చరికలు జారీ చేస్తుండడంతో కార్మికులు కూడా పోరాటాలు చేసేందుకు ముందుకు రావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయనే భయంతోనే కార్మికులు పోరాటాలకు దూరంగా ఉంటున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కాగా చిన్న కార్మిక సంఘాల ప్రధాన నాయకులు మాత్రం పెద్ద సంఘాలు చేసే పోరాటాలకు హాజరవుతున్నారే తప్పా క్యాడర్ మాత్రం ఎలాంటి పోరాటాలకు హాజరు కావడం లేదు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కూర్మన్నపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓషియన్ గ్రీన్స్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున ఈ నెల 22వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-2 ఈఈ టీకే నాయుడు, ఏడీఈ రామకృష్ణలు తెలిపారు. ఈ కారణంగా వుడా నగర్-2, సైమన్ నగర్, ఓషియన్ గ్రీన్స్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మట్టితో శివలింగాల తయారీ

అగనంపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకలోని రాజీవ్‌గాంధీ కల్యాణ మండపంలో శ్రీసింహాశైల సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళలు మట్టితో శివ లింగాలను తయారు చేస్తున్నారు. కోటి శివలింగాల కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. రెండు రోజులుగా వేల సంఖ్యలో శివలింగాలను తయారు చేశామన్నారు. బుధవారం బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు పాల్గొని శివలింగాలను తయారు చేయడంతో పాటు పూర్తయిన వాటిని పార్శిల్ చేసినట్టు సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు తెలిపారు.

గురుస్వాములకు సత్కారం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ లోపల గల పురాతన శివాలయంలో అయ్యప్ప గురుస్వాములను ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఉక్కు నిర్వాసిత కాలనీల నుంచి విచ్చేసిన భక్తులతో పాటు మాలధారణ చేసిన ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వాములకు మధ్యాహ్నం భిక్ష (అన్న సమారాధన)ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బద్రు నాయక్, యేలేటి శ్రీనివాసరావు, ధర్మాల కనకరెడ్డి, చీకటి శ్రీనివాస్, కాళీదాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్, రెడ్రెసెల్ చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. చైర్మన్‌గా నియమితులైన ఆయనను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కలిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో ఆయన మాట్లాడుతూ ప్లాంటును మరింత ప్రగతిపథంలోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని, ఉత్పత్తి పెంపే లక్ష్యంగా అందరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బొండ తౌడన్న, బయ్యే మల్లయ్య, ఎస్.సత్యనారాయణ, మోహన్‌బాబు, కేవీ రత్నం, రామన్న, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మలేరియాతో పాటు ఇతర వ్యాధుల పట్ల ప్రజలంతా అవగాహన కలిగివుండాలని 69వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్ అన్నారు. నాతయ్యపాలెంలో బుధవారం మలేరియా విభాగ కళా బృందాల ఆధ్వర్యంలో కళారూపాల ద్వారా ప్రజలకు మలేరియా నియంత్రణపై అవగాహన కల్పించారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 30, వంకాయలు (తెలుపు) 32,వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 20, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 30, క్యారెట్ 60 దొండకాయలు 34, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోస కాయలు 25, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 55, పొటల్స్ 52, కీర దోస 26, కాప్సికమ్ 50,పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 75, కొండ ఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35,పుదీన 5, చుక్కకూర 4,పాలకూర 4, తోటకూర 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

విజ్ఞాన కేంద్రాలు గ్రంథాలయాలు

గాజువాక ఎంఈవో విశ్వనాథ్

గాజువాక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, గ్రంథాలయాల్లో ఎనలేని విజ్ఞానం లభిస్తుందని గాజువాక ఎంఈవో విశ్వనాథ్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల ముగింపును బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంత టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్నప్పటికీ పుస్తకాల వల్ల చాలా విజ్ఞానం చేకూరుతుందన్నారు. నేటి యువతకు గ్రంథాలయాలు అంటే అవగాహన తక్కువగా ఉందని, ఒకసారి లైబ్రరీకి వచ్చి చూస్తే మళ్లీ బయటకు వెళ్లరని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి చంద్రకళ, పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి, గాజువాక హైస్కూల్ హెచ్‌ఎం విజయప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి: సీఐ

పెదగంట్యాడ: విజ్ఞాన సముపార్జనకు విద్యార్థులందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ జి.దాలిబాబు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు లైబ్రరీలను ఉపయోగించుకోవడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి మాట్లాడుతూ పుస్తకం హస్త భూషణం అని అన్నారు. సాహిత్యసుధ వ్యవస్థాపకులు అద్దంకి రాఘవాచార్యులు మాట్లాడుతూ విజ్ఞానానికి మించిన ఆభరణం లేదన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి పీవీ రమణ, పలువురు పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెదగంట్యాడలో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సీఐ దాలిబాబు, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి



ఆటోనగర్ ఎఫ్-బ్లాక్ రోడ్డు గత నెల ఇలా..



అదే రహదారి ఇప్పుడిలా..

హమ్మయ్య కొత్తగా రోడ్డేశారు..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆటోనగర్, నవంబరు 20: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు ఆటోనగర్ ఎఫ్-బ్లాక్ రోడ్లు గోతులమయంగా మారాయి. అడుక్కో గొయ్యి ఏర్పడడంతో ఈ మార్గంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు 'ఆంధ్రజ్యోతి'లో 'దారుణ దారులు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆటోనగర్ ఎఫ్-బ్లాక్‌లో నూతనంగా రోడ్డు వేయడంతో స్థానికులతో పాటు పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు, కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి విశాఖ డెయిరీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేతన సవరణ, కనీస వేతనాలు అమలు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశాఖ డెయిరీ కార్మికులు గురువారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. గత 20 ఏళ్లుగా కార్మిక సంఘం లేని విశాఖ డెయిరీలో సీఐటీయూ ఆధ్వర్యంలో గతనెల ఏర్పడిన విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో తమ హక్కుల సాధన కోసం కార్మికులు దీక్షలకు దిగుతున్నారు. ఈ ఆందోళనకు డెయిరీలో విధులు నిర్వర్తిస్తున్న పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్టు, ట్రైనీ కార్మికులు కూడా మద్దతు తెలుపుతుండడం గమనార్హం. 2018 నాటి వేతన సవరణ చేపట్టి అర్హులకు పదోన్నతులు, అలవెన్స్‌లు, బోనస్‌లు చెల్లించాలని, పదవీ విరమణ వయస్సు 60 ఏళ్లు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కనీస వేతనం రూ.21 వేలు చేయడంతో పాటు అగ్రిమెంట్‌తో పనిచేస్తున్న ఉద్యోగులు, ట్రైనీలను పర్మినెంట్ చేయాలని, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'తప్పుడు హామీలతో మోసం'

పెందుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు, బుధవారం ఆయన రాంపురంలో ఉన్న వైసీపీ కార్యాలయంలో 93వ వార్డు కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వార్డుల్లో పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం, తదితర అంశాలపై చర్చించారు.

'స్టీల్‌ప్లాంటుపై మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలి'

కూర్మన్నపాలెం,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరగకుండా ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని ఈ నెలలో విశాఖ రానున్న ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు కారు రమణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,378వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా వెనుకాడబోమన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ సమస్య పరిష్కారం కావాలంటే సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పీఎఫ్ కమిషనర్‌కు వినతి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీలో పలువురు సీనియర్ కార్మికుల పీఎఫ్ అకౌంట్‌లో డేట్ ఆఫ్ జాయినింగ్ తప్పుగా ఉందని, వాటిని సరిచేసి న్యాయం చేయాలని పీఎఫ్ కమిషనర్‌కు బుధవారం భెల్ హెచ్‌పీవీపీ బీఎంఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. డేట్ ఆఫ్ జాయినింగ్ తప్పుగా ఉండడం చవల్ల ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తపరిచారు. కార్యక్రమంలో నాయకులు పి.జగదీశ్వరరెడ్డి, లావారెడ్డి, ముత్యాలు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపులో ఉద్రిక్తత

- ఫుట్‌పాత్ వ్యాపారులపై విరుచుకుపడిన గాజువాక ట్రాఫిక్ పోలీసులు
- కాయగూరలు, పండ్లు చెల్లాచెదురు
- లబోదిబోమంటున్న చిరు వ్యాపారులు



సామగ్రిని చెల్లాచెదురుగా పడవేసిన పోలీసులు

మల్కాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జింక్ గేటు సమీపంలో ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై గాజువాక ట్రాఫిక్ పోలీసులు విరుచుకుపడ్డారు. వాస్తవానికి ఈ ఫుట్‌పాత్‌లపై పాదచారులు నడవరు. ఇక్కడ జన సంచారం కూడా అంతగా ఉండదు. కానీ వ్యాపారుల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పోలీసులు రెచ్చిపోయి మరీ హడావిడి చేశారు. బుధవారం ఉదయం వ్యాపారులు యథావిధిగా కూరగాయలు, పండ్లు పెట్టుకొని వ్యాపారం చేస్తుండగా ట్రాఫిక్ పోలీసులు ఒక్కసారిగా వచ్చి దుకాణాలను చెల్లాచెదురు చేశారు. పోలీసులు తమకు ముందుగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ఒక మాట చెబితే తామే స్వచ్ఛందంగా దుకాణలను తొలగించే వాళ్లమని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోవిడ్ సమయంలో పోలీసులే ఇక్కడ వ్యాపారం చేసుకోవాలని తమకు చెప్పారని అంటున్నారు. ఇప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం అంటూ దుకాణాలను తొలగించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. ఈవిషయమై ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫుట్‌పాత్ వ్యాపారాల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్నాయని, అందువల్లే దుకాణాలను తొలగించామని చెప్పారు.సామాన్లు తీయించే ప్రయత్నంలో కొన్ని కింద పడ్డాయన్నారు. గాజువాకలో కూడా ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని ఆయన తెలిపారు.



వ్యాపారులను హెచ్చరిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం ధర్నా

వేపగుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో పేదలకు కేటాయించిన ఇళ్లు, స్థలాలను లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు ఆ పార్టీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు వేపగుంట ముత్యాలమ్మ కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు, స్థలాలను లబ్ధిదారులకు కేటాయిస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. గతంలో పెందుర్తి నియోజకవర్గంలో దున్నేవాడిదే భూమి అన్న నినాదంతో పోరాటం చేసి విజయం సాధించిన విషయం తెలిసిందేనని, అదే స్ఫూర్తితో భవిష్యత్తులో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనం తరం వేపగుంట సచివాలయం వరకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో నాయ కులు ఆర్. శ్రీనివాస్, వై. త్రినాథ్, రాంబాబు, అసిరినాయుడు, మిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

మల్కాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ పీఆర్‌వో కాశీ పేర్కొన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్య మనం భవిష్యత్‌కు పెట్టే పెట్టుబడి అని చెప్పారు. హెచ్‌పీసీఎల్ సీనియర్ అధికారి సుమాన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం హెచ్‌పీసీఎల్ అధికారులను పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి, గ్రంథాయాధికారి అజయ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపీఎస్ భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయదేవీ, మల్కాపురం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీని వాస్ తదితరులు పాల్గొన్నారు.

సింధియా : జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డు కాలనీలో ఉన్న పౌర గ్రంథాలయంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కనకరాజు, హెచ్‌ఎస్‌ఎల్ యూనియన్ నాయకులు సత్యనారాయణ, ఉపాధ్యాయలు హరినాథ్, మూర్తి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్సీ ట్రస్ట్ అధినేత దాడి రమణచిట్టి

పెందుర్తి : పెందుర్తి శాఖా గ్రంథాలయంలో జరిగిన వారోత్సవాలు కూడా ముగిసాయి. డీఆర్సీ అధినేత రమణచిట్టి వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వేగి దివాకర్, గ్రంథాలయాధికారి సూర్యకళ, నరసింహమూర్తి, సత్తిబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.



భద్రాచలానికి పాదయాత్రగా బయలుదేరిన కాకి గోవిందరెడ్డి, తదితరులు

కాలినడకన భద్రాచలానికి కార్పొరేటర్

చంద్రబాబు సీఎం కావడంతో మొక్కు చెల్లిస్తున్నానన్న గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మొక్కు చెల్లించేందుకు కాలినడకన భద్రాచలం బయలుదేరారు 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి. వైసీపీ హయాంలో అక్రమంగా అరెస్టయిన చంద్రబాబు నాయుడు విడుదలై మళ్లీ ముఖ్యమంత్రి అయితే తాను పాదయాత్ర చేపట్టి భద్రాచలం వస్తానని మొక్కుకున్నానన్నారు. ఈ మేరకు బుధవారం తుంగ్లాంలోని విజయరాఘవస్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశాక పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు మంచి భవిష్యత్తునిచ్చిన చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. కాలినడకన భద్రాచలం చేరుకుని కోదండరాముడ్ని దర్శించుకుంటానని పేర్కొన్నారు. తనతో పాటు 15 మంది యువకులు పాదయాత్రలో పాల్గొంటున్నారని గోవిందరెడ్డి తెలిపారు.

బూత్ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

జిల్లా ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు

గాజువాక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు కోరారు. స్థానిక కుంచుమాంబ కాలనీలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 32 మంది సభ్యులతో ఈ నెల 25వ తేదీలోగా బూత్ కమిటీల నియామకాలను చేపట్టాలన్నారు. కేంద్రం సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. ప్రజల సంక్షేమమే బీజేపీ లక్ష్యమన్నారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, నాయకులు పావని, సుబ్బరాజు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'విజ్ఞాన్'లో ఆధ్యాత్మిక సమగ్రతపై అవగాహన

అగనంపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఐటీ విభాగం ఆధ్వర్యంలో శాస్త్రం, ఆధ్యాత్మిక సమగ్రత అనే అంశంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌కు చెందిన భక్తి స్వరూపలు వరుణ్‌లాల్, వాసుదేవరావు ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ శాస్త్రం ప్రగతి పథాన్ని చూపుతుందని, ఆధ్యాత్మికత నైతికత, ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుందన్నారు. శాస్త్రం, ఆధ్యాత్మికతను విద్యార్థులు సమగ్రంగా అర్థం చేసుకోవాలని కోరారు. అనంతరం అతిథులను విజ్ఞాన్ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, ఐటీ విభాగాధిపతి నీలిమ, బ్రిజేశ్, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

మల్కాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 61వ వార్డు రామకృష్ణాపురంలో జరుగుతున్న గౌరీ పరమేశ్వర్ల ఉత్సవంలో భాగంగా బుధవారం సారె సమర్పించారు. మహిళలు పెద్ద ఎత్తున రామకృష్ణాపురం ప్రాంతానికి చేరుకొని దాదాపు 21 రకాల పిండి వంటలు. స్వీట్లు, పండ్లు అమ్మవారికి సమర్పించారు. ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ సారె ఊరేగించారు. మధ్యా హ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధా, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర అధికారికి ఘన స్వాగతం

గోపాలపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగర పర్యటనకు వచ్చిన ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ (రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ హైదరాబాద్) అధికారి కె. వెంకట్రావుకు ఎస్సీ, ఎస్టీ ఫోరమ్ సభ్యులు విమానాశ్రయంలో బుధవారం ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో అంబేద్కర్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ప్రభాకరరావు, ప్రతినిధులు భీమారావు, కమలాకరరావు, కార్తిక్, తదిత రులు పాల్గొన్నారు.



వెంకటరావుకు స్వాగతం పలుకుతున్న ఎస్సీ, ఎస్టీ ఫోరమ్ సభ్యులు

అనారోగ్యంతో రిటైర్డ్ హెచ్‌ఎం మృతి

పెందుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరిపల్లి హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేసిన కోరాడ వీరభద్రరావు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన ఎస్‌ఏడీ కొత్తరోడ్డు పీఎఫ్ ఆఫీస్ వద్ద నివాసం ఉంటున్నారు. శొంఠ్యాం మాస్టారుగా పెందుర్తిలో సుపరిచితులైన ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.



వీరభద్రరావు (ఫైల్)

సేవే పరమావధిగా సత్యసాయి సమితి సేవలు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి జయంత్యుత్సవాల్లో భాగంగా స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సమితి ఆధ్వర్యంలో బుధవారం యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. మందిరంలో ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణం, రుద్రాభిషేకం, మంగళహారతి వంటి పూజాది కార్యక్రమాలను చేపట్టారు. అలాగే అగనంపూడి ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం ఆటో డ్రైవర్లకు యూనిఫారాలు అందజేసి, రహదారి భద్రత నియామాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌లో అందరూ భాగస్వాములవ్వాలి

అగనంపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ నిర్వహణలో అందరూ భాగస్వాములు కావాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కోరారు. స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నడక మైదానంలో బుధవారం ఆయన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవన్నారు. వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం క్లబ్ సభ్యులతో కలిసి మైదానంలో గల ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, చెత్తాచెదారాన్ని ఏరి డంపింగ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు, టీడీపీ నాయకుడు కర్రి దశేంద్ర, గల్లా రాజు, బి.సత్యనారాయణ, ఎం.నరసింగరావు, కె.పైడిరాజు, ఎం.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

పిక్నిక్‌కు వెళ్లొద్దామా..!

నగర పరిధిలోనే బోలెడు పిక్నిక్ స్పాట్‌లు

పర్యాటకులను ఆకర్షించే ఉద్యానవనాలు

కార్తీకమాసంలో వన భోజనం సంప్రదాయం. పుణ్యం పురుషార్థం దక్కేలా రోజంతా సరదాగా ఏ ఉద్యానవనంలోనో, చక్కని సందర్శనీయ ప్రాంతంలోనో గడపడం, మధ్యాహ్నం విందు ఆరగించి రావడం ఆనవాయితీ. ఈ సీజన్ వచ్చిందంటే మహిళల కంటే ముందు పిల్లలు, పురుషులు పిక్నిక్‌కు ఎక్కడికి వెళ్దామా అని ఎదురుచూస్తుంటారు. ఇందుకోసం ఏ దూరప్రాంతానికో పరుగు పెట్టాల్సిన అవసరం లేదు. నగర పరిధిలోనే చాలా సందర్శనీయ, ఆహ్లాదకర ప్రదేశాలు ఉన్నాయి.

- ఎంవీపీకాలనీ, ఆంధ్రజ్యోతి



వుడా పార్కు

అతి పెద్ద వుడా పార్కు

వీఎంఆర్‌డీ నిర్వహిస్తున్న అతి పెద్దదైన వుడా పార్కులో పిల్లల ఆట వస్తువులకు కొదవలేదు. పచ్చని, వినూత్న, అందమైన మొక్కలు, చెట్లతో ఆహ్లాద వాతావరణం పార్కు సొంతం. వేలాది మంది వచ్చినా స్వాగతం పలికే పచ్చని బయళ్లున్నాయి. సాగర తీరాన్ని ఆనుకుని, రామకృష్ణా బీచ్‌కు దగ్గరలో ఉన్న ఈ పార్కులోని చెరువులో బోటింగ్ ఉంది. ప్రవేశ దరలు పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10.

కంబాలకొండ..అందాలే మది నిండా!

నగరంలో అడవిని చూడాలంటే కంబాల కొండకు వెళ్లాల్సిందే. జూ పార్కు ఎదురుగా ఉన్న ఈ కొండ అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉండగా, శంభువానిపాలెం గిరిజనులు నిర్వహిస్తున్నారు. ఇది రిజర్వు అటవీ స్థలం. ఇక్కడ జింకలు కూడా కనిపిస్తాయి. డేగలగెడ్డ రిజర్వాయర్ అందం వర్ణనాతీతం. ఆటపాటల కోసం స్థలానికి కరవే ఉండదు. పెద్ద పెద్ద సంస్థలు, కుల సంఘాలు వేలాది మందితో ఇక్కడ వనభోజనాలు ఏర్పాటు చేస్తుంటాయి. గోట్ వాక్, బర్మా బ్రిడ్జి, జిప్ లైనర్ ప్రధాన ఆకర్షణ. ప్రవేశ టిక్కెట్లు పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.20, కారుతో లోపలకు వెళ్లాలంటే రూ.వెయ్యి.

శివాజీ పార్కు..అందాల హరివిల్లు

శివాజీపాలెంలోని శివాజీ పార్కును ఇటీవల రూ.కోట్లు వెచ్చించి వినూత్నరీతిలో తీర్చిదిద్దారు. చీకటి పడితే వాటర్ ఫౌంటెన్లు అబ్బురపరుస్తాయి. పిల్లల ఆట వస్తువులు, ఓపెన్, ఇండోర్ ఆడిటోరియం, షెల్టర్లు అబ్బో చాలా ఉన్నాయి. రోజంతా తిరిగినా ఇంకా చూడాలనిపిస్తుంది. ప్రవేశ టిక్కెట్లు పెద్దలకు రూ.10, పిల్లలకు రూ.5.

జూలో విశేషాలెన్నెన్నో...

పిల్లలకు వినోదం, విజ్ఞానం అందించే ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల గురించి ఎంత చెప్పినా తక్కువే. 400 ఎకరాల్లో సుమారు 90 జాతులు, వెయ్యి వన్య ప్రాణులతో అలరారుతున్న జూకు వెళితే, జంతువులను చూడడంతో పాటు విజ్ఞానం లభిస్తుంది. నడవడం కష్టమనుకునే వారికి బ్యాటరీ వాహనాలు అందుబాటులో ఉన్నాయి. జాతీయ రహదారి, బీచ్ రోడ్డు నుంచి రెండు ప్రవేశాలు ఉన్నాయి. ప్రవేశ రుసుము పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.30, కారుకు రూ.700.



కైలాసగిరి



ముడసర్లోవ పార్కు

వందేళ్ల ఉద్యానవనం ముడసర్లోవ

1901లో బ్రిటీష్ వారు నిర్మించిన ఉద్యానవనం ముడసర్లోవ పార్కు. నగరానికి నీటిని అందించేందుకు నిర్మించిన రిజర్వాయరుకు అనుబంధంగా దీనిని అభివృద్ధి చేశారు. కార్తీకమాసం వస్తే ఆదివారాల్లో ఇసుక వేస్తే రాలనంత జనం. చుట్టూ పచ్చదనంతో నిండిన కొండలు, మధ్యలో పార్కు ఇక్కడి ప్రత్యేకం.

చిన్నారులను ఆకట్టుకునే పార్కులు

- మది దోచే సముద్ర తీర ప్రదేశాలు
- ఆహ్లాదకర పరిసరాలెన్నెన్నో...

కైలాసగిరి...అందాల ఝరి

కొండపై నిర్మించిన అందమైన ప్రదేశం కైలాసగిరి. భారీ శివ పార్వతుల విగ్రహాలు ప్రత్యేకం. కొండ పైనుంచి చూస్తే నగరం పాదాలకింద ఉన్నట్టు ప్రత్యేక అనుభూతి. మరోపక్క సముద్ర హోరు. కొండంతా తిప్పే టాయ్ ట్రైన్, అప్పుఘర్ నుంచి వెళ్లడానికి మెట్లమార్గం, రోప్‌వే, హనుమంతువాక నుంచి మెట్లమార్గం, జోడుగుళ్ల పాలెం నుంచి వచ్చేవారికి రోడ్డు మార్గం ఉన్నాయి. తెలుగు మ్యూజియం ఇక్కడి మరో ప్రత్యేకత.

అద్భుత ఫొటోలకు లుంబినీ పార్కు

ఎంవీపీ అప్పుఘర్ ప్రాంతంలో నిర్మించిన లుంబినీ పార్కు లోపలకు వెళ్లగానే భారీ బుద్ధుని విగ్రహం అబ్బురపరుస్తుంది. వెంటనే ఓ ఫొటో తీయించుకోవడమో, సెల్ఫీ తీసుకోవడమో చేస్తాం. ల్యాండ్ స్కేపింగ్‌లో అరుదైన, అందమైన మొక్కలు ఆకట్టుకుంటాయి. పిల్లలకు ఆడుకోవడానికి పరికరాలున్నాయి. ప్రతి చోటా ఫొటోలకు అనుకూలమే. ఎదురుగా సముద్రం కనువిందు చేస్తుంది.



ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల

నీలి సంద్రంపైనే తెన్నేటి పార్కు

బీచ్‌రోడ్డులో జోడుగుళ్లపాలెం, అప్పుఘర్ మధ్యన ఉన్న తెన్నేటి పార్కు అందాల నిలయం. ఇక్కడి నుంచి సముద్ర అందాన్ని వీక్షించేందుకు రెండు కళ్లు చాలవు. పాము మెలికలు తిరిగినట్టు కనిపించే రహదారి, శిఖరాన్ని తాకినట్టున్న భవనాలు, తీరినికి వచ్చి ఇరుక్కుపోయిన పెద్ద షిప్...కిందకు దిగితే పాదాలను తాకే కెరటాలు సందర్శకులను కట్టిపడేయడం ఖాయం.

పురాతన నగరం..భీమునిపట్నం

అత్యంత పురాతన నగరంగా గుర్తింపునొందిన భీమునిపట్నం తీర ప్రాంతంలో పిక్నిక్ అంటే అదో సందడి. ఆకట్టుకునే పార్కులు, నదీ సాగర సంగమం, కొండపై లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, పురాతన వీధులు, ఆకట్టుకునే గంటస్తంభం ఇలా... ఒకటేమిటి...భీమిలి అందాలు కనువిందు చేస్తాయి. ఇక్కడి తీరంలో ఫొటోలు తీసుకోవడం, స్నానాలు చేయడం సందర్శకులకు సరదా.

ప్రకృతి దిద్దిన ఎర్రమట్టి దిబ్బలు

భీమునిపట్నంలోనే మరో అందమైన ప్రదేశం ఎర్రమట్టి దిబ్బలు. ఎర్రని మట్టితో కూడిన ఎత్తైన దిబ్బలు, ప్రకృతి దిద్దినట్టుగా వాటి మధ్య దారులు, ఆహ్లాదాన్ని పంచే చెట్లు, ఇసుక, ఎదురుగా సముద్రం అదో అద్భుత దృశ్యం. ఎన్నో సినిమాల్లో సన్నివేశాలు, పాటలకు ఇది చిరునామాగా మారింది. ఏటా కార్తీక మాసంలో ఇక్కడ పిక్నిక్‌లు జరుపుకునేందుకు భారీ సంఖ్యలో జనం తరలివస్తారు. ముఖ్యంగా ఆదివారం ఎర్రమట్టి దిబ్బలు సందర్శకులతో నిండిపోయి, జన జాతరను తలపిస్తాయి.

యారాడ కొండ...తలపులే నిండా

నగరానికి అతి సమీపంలోనే ఉన్న మరో అత్యద్భుత తీర ప్రదేశం యారాడ కొండ. ఇక్కడి సుందర దృశ్యాలను తిలకించేందుకు ప్రతిరోజూ సందర్శకులు తరలివస్తుంటారు. కాగా కార్తీకంలో పిక్నిక్‌లకు వచ్చే వారి సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఎగసిపడే సముద్ర అలలు, ఎత్తైన కొండ, దాని పక్కగా సంద్రం, అక్కడ శిలలు మనసును కట్టిపడేస్తాయి. రోజంతా ఉల్లాసంగా గడిపేందుకు ఇదే చక్కని ప్రదేశం.

23 నుంచి క్రికెట్ మ్యాచ్‌లు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సయ్యద్ ముస్తక్ అలీ ట్రోఫీ టీ 20 మ్యాచ్‌లు 23 నుంచి డిసెంబరు 5 వరకు నిర్వహిస్తామని ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలకు కలెక్టర్ ఆదేశం

జగదాంబ కూడలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ స్టేడియంలో ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులను కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. స్టేడియంలో అభివృద్ధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. క్రీడా సంస్థలు అద్దె చెల్లించకుండా భవనాలను వినియోగించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బ్యాడ్మింటన్ కోర్టుల పనులు అసంపూర్తిగా ఉండడంపై ప్రశ్నించారు. స్టేడియం పచ్చదనంతో కళకళలాడాలని, పచ్చిక పెంపకంపై దృష్టిసారించాలన్నారు. గ్రౌండ్, పెవిలియన్, మేడపైన వసతులను పరిశీలించారు. ఇప్పటివరకు ఖర్చు చేసిన వివరాలను తెలుసుకున్నారు. జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఈఈ శ్రీనివాసరావు, డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ షమీర్ ఉన్నారు.



అభివృద్ధి పనుల మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్

ఇళ్ల నిర్మాణంలో పురోగతి లేకుంటే చర్యలు

ప్రధాన మంత్రి ఆవాస యోజనలో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పనపై సమీక్షించారు. ప్రగతి చూపని మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఎ.శ్రీనివాసరావు, కె.సూర్యారావు, సత్యవేణి, బి.వి. రమణమూర్తి, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో జల వనరుల సంరక్షణ

విశాఖపట్నం: జిల్లాలోని చెరువులు, సాగునీటి కాలువలు, స్లూయిజ్‌లు, జలధారలను సంరక్షించేందుకు ప్రత్యేక ప్రణాళిక, సమష్టి కృషి అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. నీటివనరుల అదనపు నిల్వసామర్థ్యాన్ని 23వేల క్యూబిక్ మీటర్లకు పెంచేందుకు చర్యలు చేపట్టాలని, వనరులను సంరక్షించేందుకు ముందుకు వచ్చిన దాన్ ఫౌండేషన్‌కు సహకరించాలన్నారు. ఆక్రమణలు తొలగించి, సరిహద్దులు గుర్తించాలని జీవీఎంసీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రైతులు సామాజిక కార్యకర్తలు ప్రజాప్రతినిధులకు చెరువుల ఆధునికీకరణతో కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. స్థానిక పరిస్థితులు ఆక్రమణలపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలన్నారు. మేహాద్రిగెడ్డ, గోస్తనీ నదిలో నీటి నిల్వల పరిస్థితిని తెలియజేయాలన్నారు. కాగా జిల్లాలోని 14 చెరువులు, 17 జలధారలు 16 కి.మీ నాగునీటికాలువ, 11 స్లూయిజ్‌ల మరమ్మతులకు సుమారు రూ.కోటి అంచనాతో ప్రణాళిక రూపొందించినట్టు దాన్ ఫౌండేషన్ ప్రతినిధి లోకేశ్ తెలిపారు. సమావేశంలో వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాధన్, జేసీ మయూర్ అశోక్, ఆర్డీఓలు శ్రీలేఖ, సంగీత్ మాధుర్, ఏడీసీ రమణమూర్తి, జీవీఎంసీ సీఈ శివప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో పతకాలు సాధించిన ఐఐఎంవీ విద్యార్థులు

విశాఖపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ (ఐఐఎం) ఆధ్వర్యంలో బెంగళూరులో జరిగిన క్రీడా పోటీల్లో విశాఖ ఐఐఎం విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 27 క్రీడా విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 196 మంది పాల్గొనగా, 12 పతకాలను సాధించారు. టేబుల్ టెన్నిస్ (మహిళలు), ఫుట్‌బాల్‌లో బంగారు, క్రికెట్, క్యారమ్స్, త్రోబాల్, ప్రిస్బీ పూల్ పురుషులు, మహిళల కేటగిరీల్లో రజత, వాలీబాల్ (మహిళలు), టేబుల్ టెన్నిస్ (పురుషులు), స్క్వాష్ (మిశ్రమ), ఫుట్‌బాల్ (పురుషులు)లో కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా వారిని అధికారులు అభినందించారు.



పతకాలు సాధించిన ఐఐఎంవీ విద్యార్థులు

వీఎంఆర్డీఏ అసెట్ మేనేజ్‌మెంట్ యాప్ ప్రారంభం

సిరిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏకు చెందిన అన్ని వాణిజ్య సముదాయాల అద్దెదారులు తమ దుకాణాల నెలవారీ అద్దె చెల్లింపులు యాప్‌లో చెల్లించవచ్చని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం యాప్‌ను ప్రారంభించారు. దీనిని హెచ్‌డీఎఫ్‌సీ అభివృద్ధి చేసి, సాంకేతిక మద్దతు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో రమేష్, హరిప్రసాద్, వెంకటేశ్వరరావు, హెచ్‌డీఎఫ్‌సీ ప్రతినిధులు పాల్గొన్నారు.



యాప్ ప్రారంభిస్తున్న కమిషనర్

ఆటోలో మరిచిపోయిన బ్యాగు అప్పగింత

గాజువాక, నవంబరు 20: ఆటోలో మరిచిపోయిన బ్యాగును పోలీసులు గంటల వ్యవధిలో బాధితురాలికి అప్పగించారు. గాజువాక బీసీ రోడ్డుకు చెందిన కె.కుమారి బుధవారం శ్రీహరిపురం నుంచి ఆటోలో ఇంటికి వెళ్లారు. హడావుడిలో బ్యాగును మరచిపోయారు. అందులో ఆరు తులాల బంగారు ఆభరణాలున్నాయి. ఇంటికి వెళ్లాక చూసుకుని గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్‌ఐ ఎ.మన్మధరావు టెక్నాలజీ సాయంతో ఆటోను గుర్తించి, బ్యాగును కుమారికి అందజేశారు.



ఆభరణాలు అందిస్తున్న ఎస్‌ఐ

ప్రారంభమైన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



నేషనల్ ఎక్స్‌పోలో చీరలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వివాహ సీజన్ సందర్భంగా నేషనల్ సిల్క్‌ఎక్స్‌పో ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను హోటల్ గ్రీన్‌పార్కులో బుధవారం ప్రారంభించారు. ఈ నెల 24వ తేదీ వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు విభిన్న వస్త్రాలు, విస్తృత శ్రేణిలో లభిస్తాయన్నారు. మహారాష్ట్ర పైథాన్ సిల్క్, బెంగళూరు సిల్క్, మధ్యప్రదేశ్‌కు చెందిన చందేరీ, మహేశ్వరి సిల్క్ చీరలు, పశ్చిమబెంగాల్‌కు చెందిన బల్చూరి జందానీ డకాయ్ మాస్లిన్ వర్క్ పిచ్ చీరలు, వేలాది రకాల సిల్క్, కాటన్, డిజైనర్ వస్త్రాలు అన్నీ ఒకేచోట లభిస్తాయన్నారు. చీరలు మాత్రమే కాకుండా దుపట్టాలు, సల్వార్ మెటీరియల్ ఇతర వస్త్రాలు ఎక్స్‌పోలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, సందర్శకులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వీవోఏల నిరసన

సిరిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడేళ్ల కాల పరిమితిని రద్దుచేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగ భద్రత కల్పిస్తామన్న ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలన్నారు. నాలుగు నెలల బకాయి జీతాలు చెల్లించాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని, మహిళా మార్ట్‌లో బలవంతపు కొనుగోళ్లు ఆపించాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి, అధ్యక్ష, కార్యదర్శులు అపర్ణ, కంచెమ్మ, శ్రీలక్ష్మి, వెంకటలక్ష్మి, పార్వతీగౌరి, శారద తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న వీవోఏలు

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

అగనంపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన అగనంపూడి పెట్రోల్ బంక్ వద్ద బుధవారం జరిగింది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా చీడికాడ ఐటీఐ కాలనీకి చెందిన జాన నాగభూషణం (56) స్కూటీపై నగరానికి వస్తున్నారు. అగనంపూడి పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి వెనుకనుంచి లారీ ఢీకొట్టి 30 మీటర్ల వరకు ఈడ్చుకుపోయింది. దీంతో నాగభూషణం అక్కడికక్కడే మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ సీఐ వెంకటావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎండాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...పీఎంపాలెంనకు చెందిన మహ్మద్ అసీఫ్ (22) మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఇతడు బీబీఏ పూర్తిచేసి, మధురనగర్‌లోని ఎంఎస్ అల్యూమినియం, హార్డ్‌వేర్ మార్కెట్ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సులు ఢీ కొని 22 మందికి గాయాలు



దాకమర్రి వద్ద జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న బస్సులు

భీమునిపట్నం (రూరల్) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బస్సు షడన్ బ్రేకు వేయడంతో దాని వెనుక వెనుకవస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో 22 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన భీమిలి మండలం దాకమర్రి గ్రామం వద్ద బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం నుంచి సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రి సిబ్బందితో వస్తున్న బస్సు దాకమర్రి వద్ద రోడ్డుకు అడ్డుగా మేకల మంద రావడంతో డ్రైవర్ షడన్‌బ్రేక్ వేశాడు. దీంతో వెనక నుంచి వేగంగా వస్తున్న ఆర్టీసీ సాలూరు డిపో బస్సు ఢీకొంది. దీంతో రెండు బస్సుల్లోని 22 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని వెంటనే సంగివలస ఆస్పత్రికి తరలించారు. డెంకాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ కారాగార శిక్ష

విశాఖపట్నం లీగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భర్తను హత్యచేసిన మహిళ, సహకరించిన మరో వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1.2 లక్షల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ బుధవారం తీర్పు చెప్పారు. ఈ మొత్తాన్ని మృతుడి పిల్లలకు అందించాలన్నారు. హత్యతో సంబంధమున్న బాలుడికి మరో న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించి, బాలల సంరక్షణ పరివర్తన కేంద్రానికి పంపింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా మోదవలస గ్రామానికి చెందిన బాడిదబోయిన రాములప్పడుకు విశాఖ జిల్లా పద్మనాభం మండలం కురుపల్లి గ్రామానికి చెందిన నరసయ్యమ్మతో 2008లో వివాహం జరిగింది. వీరు కురుపల్లిలోనే కాపురం పెట్టారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. కొంతకాలం తరువాత నర్సయ్యమ్మ తన అక్కకొడుకు గండిబోయిన అప్పలరాజుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయంలో వారి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. 2013 ఫిబ్రవరి 13న శివరాత్రి రోజున రాములప్పడు భార్యపిల్లలతో తన స్వగ్రామం వెళ్లాడు. అదే రోజు రాములప్పడును చంపేందుకు నర్సయ్యమ్మ, అప్పలరాజు, అప్పరాజు తమ్ముడు (మైనర్) పథకం వేశారు. అదే రోజు రాత్రి కర్రలతో కొట్టడంతో రాములప్పడు మృతి చెందాడు. ముగ్గురూ కలిసి మృతదేహాన్ని పద్మనాభం మండలం కురుపిల్లిరోడ్డుపక్కన పడేశారు. గుర్తించిన మృతుడి తమ్ముడు అన్నవరం ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి, విచారణ అనంతరం కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

అత్యాచారం కేసులో నిందితులకు రిమాండ్

మహారాణిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం చేసిన నిందితులకు కోర్టు డిసెంబరు 2 వరకు రిమాండ్ విధించింది. గాజువాక ప్రాంతానికి చెందిన యువతిని బాత వంశీ, జాలారిపేటకు చెందిన బొడ్డు జగదీశ్, కృష్ణాగార్డెన్స్‌కు చెందిన పోలిపల్లి ఆనంద్, చేపలుప్పాడకు చెందిన దవులపల్లి రాజేష్ సామూహికంగా పలుమార్లు అత్యాచారం చేసిన విషయం తెలిసిందే. ఇంకా తమతో గడపాలంటూ నలుగురు వేధిస్తుండడంతో తట్టుకోలేక బాధితురాలు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిని బుధవారం రెండో ఏసీఎంఎం కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు.